TGTEL/25/A2649

# వాయిస్ టుడే

VOICE OF PRAJALU

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మనసేత్రం

Follow

పేజీలు 10

గురువారం, ఫిబ్రవరి 5, 2026

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## బోయింగ్ డిఫెన్స్ విభాగంలో 300 ఉద్యోగాలకు కోత

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన విమాన తయారీ సంస్థ 'బోయింగ్' తన డిఫెన్స్ విభాగంలో పెద్ద ఎత్తున ఉద్యోగాల కోతను చేపట్టింది. సైప్లై చైన్‌లో పనిచేస్తున్న దాదాపు 300 మందిని విధుల నుంచి తొలగిస్తున్నది.ఎంతమందిపై దీని ప్రభావముంది, ఎవరెవరు ఉద్యోగాలు కోల్పోయారన్న విషయాలు మరికొద్ది రోజుల్లో బయటకు రానున్నట్టు ఈ అంశంతో సంబంధమున్న ఓ వ్యక్తి మీడియాకు తెలిపారు.






ఆర్టికల్ 370 రద్దు, ఈశాన్య భారతాన్ని ఉగ్రవాదం నుంచి విముక్తి చేయడం, ఆపరేషన్ సిందూర్, పాకిస్థాన్ ఉగ్రవాదులకు వారి శిబిరాల్లోకే వెళ్లి బుద్ధి చెప్పడం, నక్సలైట్లను నిర్మూలించడం, సింధూనది జలాల ఒప్పందాన్ని బుట్టదాఖలు చేయడం వంటి పనులు చేసినందుకే నా కోసం ప్రతిపక్షాలు సమాధిని తవ్వాలనుకుంటున్నాయి.

# రాష్ట్రపతి పదవిని అవమానించారు: ప్రధాని

- వరుస ఎన్నికల ఓటములు జీర్ణించుకోలేక కాంగ్రెస్
- పేద గిరిజన మహిళ ఉన్నతస్థాయికి చేరడం భరించలేకపోతున్నారు
- లోక్‌సభలో అడ్డంకులు సృష్టించడం ప్రజాస్వామ్యానికి మచ్చ
- బిట్టూపై వ్యాఖ్యలు సిక్కులకు అవమానం
- డీల్స్ పేరుతో దేశాన్ని దోచుకున్న చరిత్ర
- నన్ను రాజకీయంగా సమాధి చేయడం వారి తరంకాదు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ తీరుపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజ్యసభలో తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల్లో వరుస పరాజయాలను ఎదుర్కొంటున్న ఆ పార్టీ వాటిని జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు. పేద కుటుంబంలో జన్మించిన వ్యక్తి దేశ అత్యున్నత స్థాయికి చేరుకోవడం, అదే స్థానంలో కొనసాగుతుండడం కాంగ్రెస్‌కు సహించలేనిదిగా మారిందని అన్నారు. తనపై ఎంత విద్వేషం గుమ్మరించినా, తనను రాజకీయంగా సమాధి చేయడం కాంగ్రెస్ పార్టీ తరంకాదని స్పష్టం చేశారు. గురువారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రధాని దాదాపు 100 నిమిషాలపాటు సుదీర్ఘంగా మాట్లాడారు. లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగంపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అడ్డంకులు సృష్టించడం పట్ల

(మిగతా 2వ పేజీలో)

## భారాస-భాజపా

# అంతర్గత ఒప్పందం బయటపడుతోంది

- రాష్ట్రాన్ని నంబర్‌వన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం
- మున్సిపల్ ఎన్నికల్లోనూ ప్రజలు గమనిస్తున్నారు
- కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది
- పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యం
- కేసీఆర్ కుటుంబ పాలనపై తీవ్ర విమర్శలు
- తెలంగాణకు కేంద్రం ఇచ్చింది శూన్యం: సీఎం



కరీంనగర్ : భారాస, భాజపా మధ్య విడదీయలేని అంతర్గత అనుబంధం ఉందని, రెండు పార్టీలు బహిరంగంగా విమర్శించుకుంటున్నా లోపల మాత్రం పరస్పర ప్రయోజనాలతో ముందుకెళ్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం గుమ్లాపూర్‌లో గురువారం నిర్వహించిన 'ప్రజాపాలన ప్రగతి బాట' బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ప్రత్యర్థి పార్టీల నేతలు నిందారోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. సభకు ముందుగా సీఎం రేవంత్‌రెడ్డి కరీంనగర్, చొప్పదండి మున్సిపాలిటీల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులతో సమావేశమయ్యారు. ఎన్నికల ప్రచార వ్యూహాలు, స్థానిక సమస్యలు, ప్రజల స్పందనపై అభ్యర్థులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, రూ.45 కోట్లతో ఏటీసీ భవనం తదితర అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిపై పెట్టిన నిబద్ధతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. సభలో మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి, పదేళ్ల భారాస పాలనలో ప్రజలకు ఏమి దక్కిందో ప్రశ్నించారు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు కోట్లాది రూపాయల ఆస్తులు కూడబెట్టారని, భారీ ఫాంహౌస్‌లు నిర్మించుకున్నారని ఆరోపించారు. పేదలకు ఇస్తామన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, యువతకు హామీ ఇచ్చిన ఉద్యోగాలు అమలు చేయలేదన్నారు. పదేళ్లలో పన్నుల రూపంలో భారీ ఆదాయం వచ్చినా ప్రజా అవసరాలపై ఖర్చు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో గతంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు ఇప్పటికీ పేదలకు అండగా నిలుస్తున్నాయని

(మిగతా 2వ పేజీలో)



## అమెరికా, భారత్ వాణిజ్య ఒప్పందంపై త్వరలో ఉమ్మడి ప్రకటన: పీయూష్ గోయల్

- రెండు దేశాల నుంచి వచ్చే వారంలో సంయుక్త ప్రకటన
- ఒప్పందానికి సంబంధించి ముసాయిదా తుది రూపు సిద్ధమవుతోందని వెల్లడి
- మార్చి నెల మధ్యలో సంతకాలు జరిగే అవకాశముందన్న పీయూష్ గోయల్

## తెలంగాణను రక్షించుకోవాలంటే బీజేపీకి ఓటు వేయాలి: కిషన్‌రెడ్డి

- ఏపీలో ఎన్నో విమానాశ్రయాలు ఉన్నా తెలంగాణలో ఎందుకు లేవని ప్రశ్న
- కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ బంగారు బాతు అయిందని విమర్శ
- దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా తెలంగాణ నుంచే వెళుతున్నాయని ఆగ్రహం



## మరో రెండేళ్లలో కేసీఆర్ సీఎం అవుతారు... అప్పుడు మిగిలిన పనులు చేసుకుందాం: హరీశ్

- గజ్వేల్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న హరీశ్
- మనల్ని బాగా చూసుకునే వారికి ఓటు వేయాలని పిలుపు
- దైర్యం ఉంటే అభివృద్ధిలో కేసీఆర్‌తో పోటీ పడాలని ముఖ్యమంత్రికి సవాల్



## కాంగ్రెస్ హామీలను నమ్మొద్దు: కేటీఆర్

- రెండేళ్ల పాలనలో ఒక్క గ్యారంటీ అమలు కాలేదు
- ఎన్నికల తర్వాత రైతుబంధు అంటున్న సీఎం మాటల్లో నిజం లేదు
- చిన్న జిల్లాలను రద్దు చేయాలన్న కుట్రపై ఆరోపణ
- కేసీఆర్‌ను తిట్టడం తప్ప పాలనలో ఫలితాలు లేవు
- మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తేల్చాల్సిన సమయం



సిరిసిల్ల: మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే మరోసారి ప్రజలు మోసపోయినట్లేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు వ్యాఖ్యానించారు. ఆరు గ్యారంటీల పేరుతో వందల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి రెండేళ్ల పాలనలో ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా

(మిగతా 2వ పేజీలో)



## పాకిస్థాన్ సరిహద్దు సమీపంలో భారత్ 'వాయు' గర్జన

- పాకిస్థాన్ సరిహద్దు సమీపంలో వాయుసేన భారీ విన్యాసాలు
- ఫిబ్రవరి 27న జైసల్మేర్‌లో 'వాయు శక్తి 2026' పేరిట ప్రదర్శన
- 'ఆపరేషన్ సిందూర్' తరహాలో సాగనున్న ఎక్సర్‌సైజ్
- రఫేల్, సుఖోయ్, తేజస్, మిగ్-29 యుద్ధ విమానాలతో ప్రదర్శన
- తొలిసారిగా మిగ్-21 లేకుండా జరగనున్న వైమానిక విన్యాసాలు

# బీజేపీని గెలిపిస్తే రూ.500 కోట్లు తీసుకొస్తాం

## ::: హుజూరాబాద్‌లో బండి సంజయ్

- గ్రామ పంచాయతీలకు కేంద్రం రూ.259 కోట్లు విడుదల చేసిందని వెల్లడి
- కేంద్రం నుంచి వందల కోట్ల రూపాయల నిధులు తెచ్చామన్న బండి సంజయ్
- బీజేపీని గెలిపిస్తే మినీ స్టేడియం నిర్మిస్తామని హామీ

హుజూరాబాద్: మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే మొదటి విడతగా తెలంగాణకు రూ.500 కోట్లు తీసుకొస్తామని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ వెల్లడించారు. హుజూరాబాద్‌లో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రూ.259 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గత కొన్నేళ్లుగా హుజూరాబాద్ అభివృద్ధి చెందలేదని విమర్శించారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని మండిపడ్డారు. కేంద్రం నుంచి అభివృద్ధి పనుల కోసం వందల కోట్ల రూపాయలు తీసుకొచ్చామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని పరికరాలను తీసుకొస్తే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అవసరమైన సిబ్బందిని నియమించడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక హుజూరాబాద్ అభివృద్ధికి పైసా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే మినీ స్టేడియం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఢిల్లీ నుంచి నిధులు తీసుకువచ్చి




(మిగతా 2వ పేజీలో)

వాయిస్ టుడే
శుక్రవారం, ఫిబ్రవరి 6, 2026

# రాష్ట్రపతి పదవిని అవమానించారు: ప్రధాని

ప్రధాని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దేశ అత్యున్నత పదవిలో ఉన్న నిరుపేద గిరిజన మహిళను, రాజ్యాంగబద్ధమైన రాష్ట్రపతి పదవిని, భారత రాజ్యాంగాన్ని అవమానించారని మండిపడ్డారు. దళితులు, గిరిజనులు, ఈశాన్య రాష్ట్రాల ప్రజల పట్ల కాంగ్రెస్ వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండించారు. ఇది కేవలం ఒక వ్యక్తిపై కాకుండా దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపైనే దాడిగా అభివర్ణించారు. కేంద్ర మంత్రి రవనీత్‌సింగ్ బిట్టూను కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ 'ద్రోహి'గా వ్యాఖ్యానించడం పట్ల ప్రధాని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిక్కు సమాజానికి చెందిన వ్యక్తిని దూషించడం ద్వారా సిక్కులందరినీ, వారి గురువులను అవమానించినట్లేనని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాల కారణంగానే అనేక మంది నాయకులు పార్టీని వీడుతున్నారని, అందుకు ఇతరులను ద్రోహులుగా ముద్ర వేయడం అన్యాయమని అన్నారు. సిక్కుల పట్ల కాంగ్రెస్‌కు ఉన్న వైరం మరోసారి బయటపడిందని వ్యాఖ్యానించారు. రాజ్యసభలో స్వతంత్ర సభ్యుడు సదానందన్ మాస్టర్‌పై జరిగిన వ్యవహారాన్ని ప్రధాని తీవ్రంగా ప్రస్తావించారు. రాజకీయ హింస కారణంగా కాలు కోల్పోయిన ఆయన తన కృత్రిమ కాలును ప్రదర్శించగా, ప్రతిపక్ష సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడం దేశమంతటినీ కలచివేసిందన్నారు. ఇలాంటి ప్రవర్తన ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, దీనికి విపక్ష ఇండియా కూటమి బాధ్యత వహించాల్సిందేనని చెప్పారు. ప్రజాస్వామ్య దేవాలయంగా భావించే పార్లమెంటులో ఇష్టానుసారంగా ప్రవర్తించడం దురదృష్టకరమన్నారు. పశ్చిమ బెంగాల్‌లో పరిస్థితులపై కూడా ప్రధాని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం చొరబాటుదార్లను రక్షిస్తోందని ఆరోపించారు. దేశ భద్రత, యువత భవిష్యత్తు, గిరిజనుల భూముల కంటే రాజకీయ లాభాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపడ్డారు. ప్రపంచంలోని



అభివృద్ధి చెందిన దేశాలే చొరబాటుదార్లను అంగీకరించని పరిస్థితుల్లో, భారత్‌లో మాత్రం వారిని కాపాడే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఇందుకోసం న్యాయవ్యవస్థపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, వామపక్షాలు దశాబ్దాలపాటు అధికారంలో ఉన్నప్పటికీ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురాలేదని ప్రధాని అన్నారు. గతంలో డీల్ అంటే బోఫోర్స్ డీల్ మాత్రమే గుర్తుకు వచ్చేదని, ఇప్పుడు దేశ ప్రయోజనాలకు ఉపయోగపడే వాణిజ్య ఒప్పందాల గురించి మాట్లాడుతున్నామని చెప్పారు. ప్రజల సంక్షేమాన్ని పక్కనపెట్టి సొంత జేబులు నింపుకోవడమే గత ప్రభుత్వాల లక్ష్యమని విమర్శించారు. భవిష్యత్తు భారత్ నిర్మాణంపై ప్రధాని స్పష్టమైన దిశను వివరించారు. నాణ్యమైన ఉత్పత్తులు, 'మేడ్ ఇన్ ఇండియా మేడ్ ఇన్ భారత్'ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించడమే లక్ష్యమన్నారు. అంతరిక్షం, సైన్స్, టెక్నాలజీ, గ్రీన్ హైడ్రోజన్, ఏఐ, అరుదైన ఖనిజాల రంగాల్లో భారత్ వేగంగా ముందుకెళ్తోందన్నారు. సంస్కరణల వల్ల ప్రభుత్వ రంగ సంస్థలు లాభాల్లోకి వస్తున్నాయని, బ్యాంకింగ్ రంగంలోనూ విప్లవాత్మక మార్పులు వచ్చాయని తెలిపారు. అంతర్జాతీయంగా భారత్ సాధిస్తున్న విశ్వాసాన్ని కూడా ప్రధాని ప్రస్తావించారు. యూరోపియన్ యూనియన్, అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందాలు భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్నవని చెప్పారు. ప్రపంచ దేశాల్లో భారత్ విశ్వసనీయ భాగస్వామిగా ఎదిగిందని, గ్లోబల్ సౌత్‌కు బలమైన గొంతుగా నిలిచిందని పేర్కొన్నారు. 'వికసిత్ భారత్' లక్ష్య సాధన దిశగా దేశం వేగంగా ముందుకెళ్తోందని ప్రధాని స్పష్టం చేశారు.

# భారాస-భాజపా అంతర్గత ఒప్పందం బయటపడుతోంది

గుర్తు చేశారు. రైతుల సమస్యలపై కూడా సీఎం మాట్లాడారు. రైతులకు ఉచిత విద్యుత్తు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, అది పార్టీకి చెందిన ప్రత్యేక గుర్తింపని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. నిరుద్యోగులకు వేలాది ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని, విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని చెప్పారు. యంగ్ ఇండియా స్కూళ్లు, కొత్త విశ్వవిద్యాలయాలు ఇందుకు ఉదాహరణలన్నారు. భాజపాపై కూడా సీఎం తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. మోదీ, అమిత్‌షా ఎన్ని సార్లు తెలంగాణకు వచ్చినా రాష్ట్రానికి గణనీయమైన నిధులు తెచ్చిపెట్టలేదన్నారు. పాలమూరురంగారెడ్డికి జాతీయ హోదా, మెట్రో రెండో దశకు నిధులు, మూసీ ప్రక్షాళన వంటి అంశాల్లో కేంద్రం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. తెలంగాణకు కేంద్రం ఇచ్చింది మాటలే తప్ప కార్యరూపంలో ఏమీ లేదని వ్యాఖ్యానించారు. భారాసభాజపా మధ్య అంతర్గత అవగాహన లేకపోతే అవినీతి ఆరోపణలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలు గమనిస్తున్నారని సీఎం అన్నారు. రెండేళ్లలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల అభివృద్ధికి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని వివరించారు. కరీంనగర్ కార్పొరేషన్‌లోనే భారీ స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో అన్ని చోట్లా కాంగ్రెస్ విజయం సాధిస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. వరంగల్, కరీంనగర్ ప్రాంతాల అభివృద్ధికి ఔటర్ రింగ్ రోడ్, డంపింగ్ యార్డుల ఆధునీకరణ వంటి ప్రణాళికలను అమలు చేస్తామని తెలిపారు. సభ ముగింపులో స్వయం సహాయక సంఘాల సభ్యులకు సీఎం



రూ.110 కోట్ల విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల పక్షాన నిలబడి పనిచేస్తుందని, అభివృద్ధి, సంక్షేమమే తమ ఏకైక అజెండా అని సీఎం మరోసారి స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ హామీలను నమ్మొద్దు: కేటీఆర్



గురువారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించిన సభలో కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలు పూర్తయ్యాక రైతుబంధు అమలు చేస్తామని సీఎం చెబుతున్నారని, అయితే ఇప్పటికే ఎన్నో పంటకాలాలు గడిచాయని గుర్తుచేశారు. ఇప్పటివరకు రైతుబంధు ఎన్ని సార్లు వేసారో ప్రభుత్వం ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడానికి మున్సిపల్ ఎన్నికలు ఎలా అడ్డంకి అవుతాయో వివరించాలని ప్రశ్నించారు.

ఎన్నికలు ముగిసే వరకు ఆశ చూపించి, ఆ తర్వాత మరోసారి ప్రజలను మోసం చేయాలనే ఉద్దేశంతోనే ఈ ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి అధికారమూ, అవకాశమూ ఉన్నప్పుడు ప్రజలకు మేలు చేయాల్సిందని కేటీఆర్ అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా గత ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విమర్శించడమే కాంగ్రెస్ పాలనకు పరిమితమైందని విమర్శించారు. అబద్ధాలు చెప్పడం, ఆరోపణలు చేయడం తప్ప రెండు సంవత్సరాల పాలనలో చెప్పుకోదగ్గ ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా లేదని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో ఏర్పాటు చేసిన చిన్న జిల్లాలను ఎత్తివేయడానికి ప్రస్తుత ప్రభుత్వం కుట్ర పన్నుతోందని కేటీఆర్ ఆరోపించారు. పరిపాలన ప్రజలకు దగ్గర కావాలన్న ఉద్దేశంతో తీసుకున్న నిర్ణయాలను రద్దు చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రజావ్యతిరేక వైఖరిని బయటపెడుతోందని అన్నారు. ఈ అంశాన్ని ప్రజలు గుర్తించి తమ ఓటుతో సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకొచ్చాయని కేటీఆర్ అన్నారు. రెండు సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న పథకాలను కూడా నిలిపివేసిందని విమర్శించారు. కల్యాణలక్ష్మీ పథకం కింద తులం బంగారం ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఒక్క లబ్ధిదారికైనా బంగారం అందించారా అని నిలదీశారు. నేతన్నల జీవనాధారాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీసిందని కేటీఆర్ ఆరోపించారు. బతుకమ్మ చీరల తయారీతో ఉపాధి పొందిన కార్మికులు ఇప్పుడు దిక్కులు చూస్తున్నారని అన్నారు. బీజేపీ నేతలు ఏమీ చేయకుండానే దేవుడి పేరు చెప్పి ఓట్లు అడుగుతున్నారని విమర్శించారు. ప్రచారంలో భాగంగా సిరిసిల్లలోని పలు వార్డుల్లో పర్యటించిన కేటీఆర్, స్థానికులతో మాట్లాడారు. ఒక వార్డులో ఓ మహిళ చేతిలో ఉన్న చిన్నారిని ఎత్తుకొని ఆడిస్తూ అభివాదం చేశారు.

# పాకిస్థాన్ సరిహద్దు సమీపంలో భారత్ 'వాయు' గర్జన



భారత వాయుసేన తన సైనిక శక్తిని, వ్యూహాత్మక సంసిద్ధతను ప్రదర్శించేందుకు సిద్ధమైంది. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో, పాకిస్థాన్ సరిహద్దుకు సమీపంలో ఫిబ్రవరి 27న 'వాయు శక్తి 2026' పేరిట భారీ వైమానిక విన్యాసాలు నిర్వహించనుంది. గతంలో సరిహద్దు దాటి ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసిన 'ఆపరేషన్ సిందూర్' తరహాలో ఈ విన్యాసాలను రూపొందించారు. ఈ ప్రదర్శన ద్వారా భారత వాయు శక్తి సామర్థ్యాలు మరోసారి ప్రపంచం దృష్టిని ఆకర్షించనున్నాయి. ఈ విన్యాసాల్లో వందకు పైగా విమానాలు పాల్గొననున్నాయని రక్షణ శాఖ అధికారులు తెలిపారు. రఫేల్, సుఖోయ్-30, తేజస్, మిగ్-29, జాగ్వార్, మిరాజ్-2000, హాక్ వంటి యుద్ధ విమానాలు లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించనున్నాయి. వీటితో పాటు స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ప్రచండ్ అటాక్ హెలికాప్టర్ కూడా రాకెట్లను ప్రయోగిస్తుంది. వాయుసేన నుంచి వైదొలిగిన మిగ్-21 విమానం ఈ తరహా విన్యాసాల్లో కనిపించకపోవడం ఇదే తొలిసారి. ఒక కృత్రిమ యుద్ధ వాతావరణాన్ని సృష్టించి, ఇంటిగ్రేటెడ్ ఎయిర్ కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా ఈ మొత్తం విన్యాసాలను పర్యవేక్షించనున్నారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్ విమానాలు, క్షిపణుల గమనాన్ని గుర్తించింది ఈ వ్యవస్థే. ఈ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా సి-295 రవాణా విమానం మొదటిసారిగా రాత్రిపూట అసాల్ట్ ల్యాండింగ్ డ్రిల్ నిర్వహించనుంది. సి-130జె సూపర్ హెర్క్యులస్ విమానం చిన్న రన్‌వేపై ల్యాండ్ అయి, గరుడ్ కమాండోలను దించి, వెంటనే టేకాఫ్ అవుతుంది. ఈ విన్యాసాల గురించి పాకిస్థాన్‌కు ముందస్తు సమాచారం అందించినట్లు, 'నోటీస్ టు ఎయిర్‌మెన్' జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పలువురు వీఐపీలతో పాటు, ఢిల్లీలోని సుమారు 40 మిత్రదేశాల రాయబార కార్యాలయాల అధికారులు కూడా హాజరుకానున్నారు.

# బీజేపీని గెలిపిస్తే రూ.500 కోట్లు తీసుకొస్తాం

అభివృద్ధి చేస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే అన్ని రకాల పన్నులు పెంచుతారని ఆరోపించారు. రాబోయే బడ్జెట్‌లో మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనపై బండి సంజయ్ స్పందించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఇతర హామీల్లాగే ఇదీ ఉందని ఎద్దేవా చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మాత్రమే తెలంగాణకు ఇళ్లు వచ్చాయని అన్నారు. కేసీఆర్‌కు, ఆయన కుటుంబానికి చర్లపల్లి జైలులో రెండు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారని, కానీ ఎర్రవల్లి ఫామ్ హౌస్ నుంచి కూడా కదిలించలేకపోయారని అన్నారు.

### కిషన్ రెడ్డి, నేను కలిసి నిధులు తీసుకొచ్చాం

తెలంగాణలోని గ్రామపంచాయతీలకు కేంద్రం నుంచి రూ.259 కోట్ల నిధులు తీసుకువచ్చామని బండి సంజయ్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. కిషన్ రెడ్డి, తాను నిరంతరం సంప్రదింపులు జరిపి ఈ నిధులు తెచ్చామని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కేవలం ప్రకటనలతో సరిపెట్టదని, కిందిస్థాయి వరకు నిధులు చేరుతాయని అన్నారు. రాజకీయాలకు అతీతంగా నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. నిధులు ఇంతటితో ఆగవని, దశలవారీగా వస్తూనే ఉంటాయని అన్నారు. అభివృద్ధి చేసే పార్టీలకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

# అమెరికా, భారత్ వాణిజ్య ఒప్పందంపై త్వరలో ఉమ్మడి ప్రకటన: పీయూష్ గోయల్

**రెండు దేశాల నుంచి వచ్చే వారంలో సంయుక్త ప్రకటన**

**ఒప్పందానికి సంబంధించి ముసాయిదా తుది రూపు సిద్ధమవుతోందని వెల్లడి**

**మార్చి నెల మధ్యలో సంతకాలు జరిగే అవకాశముందన్న పీయూష్ గోయల్**

భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందంపై త్వరలో ఉమ్మడి ప్రకటన ఉంటుందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. రెండు దేశాల మధ్య జరిగిన అతిపెద్ద ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో ఇది మొదటి అంకమని ఆయన అన్నారు. రెండు దేశాల నుంచి వచ్చే వారంలో సంయుక్త ప్రకటన వెలువడుతుందని కేంద్ర మంత్రి వెల్లడించారు. ఒప్పందానికి సంబంధించి ముసాయిదా తుది రూపు సిద్ధమవుతోందని పీయూష్ గోయల్ అన్నారు. ఈ ఒప్పందానికి సంబంధించి మార్చి నెల మధ్యలో సంతకాలు జరిగే అవకాశముందని వెల్లడించారు. ఉమ్మడి ప్రకటన వెలువడిన అనంతరం, భారతదేశంపై సుంకాలను 18 శాతానికి తగ్గిస్తూ అమెరికా ఒక కార్యనిర్వాహక ఉత్తర్వును విడుదల చేస్తుంది. మూడు రోజుల క్రితం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడడం తెలిసిందే. అనంతరం ట్రంప్ "భారతదేశానికి చెందిన ఉత్పత్తులపై ఇక నుంచి అమెరికాలో 18 శాతం సుంకాలు మాత్రమే ఉంటాయి" అని పోస్టు చేశారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి ఆమోదం తెలిపినట్టు ప్రకటించారు.

# మరో రెండేళ్లలో కేసీఆర్ సీఎం అవుతారు... అప్పుడు మిగిలిన పనులు చేసుకుందాం: హరీశ్

**గజ్వేల్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న హరీశ్ రావు**

**మనల్ని బాగా చూసుకునే వారికి ఓటు వేయాలని పిలుపు**

**ధైర్యం ఉంటే అభివృద్ధిలో కేసీఆర్‌తో పోటీ పడాలని ముఖ్యమంత్రికి సవాల్**




గజ్వేల్ : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరో రెండేళ్లలో మరోసారి ముఖ్యమంత్రి అవుతారని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక మిగిలిన అభివృద్ధి పనులు పూర్తి చేసుకుందామని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ వాళ్లు ఏమీ చేయరని విమర్శించారు. గజ్వేల్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న హరీశ్ రావు మాట్లాడుతూ, మనల్ని బాగా చూసుకునే వారికే ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఒకప్పుడు పందులతో ఉన్న గజ్వేల్ ఆసుపత్రి కేసీఆర్ వచ్చాక ఎలా అయిందో అందరూ గుర్తుంచుకోవాలని అన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చింది కానీ వాటిని అమలు చేయలేదని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కల్యాణ లక్ష్మి ఇవ్వలేదు కానీ బంగారం ధర మాత్రం భారీగా పెరిగిందని అన్నారు. అప్పుడు బంగారం ఆశపెట్టిన ముఖ్యమంత్రి ఇప్పుడు మాట్లాడటం లేదని విమర్శించారు. కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులపై తిట్ల వర్షం కురిపించడం తప్ప రేవంత్ రెడ్డికి తెలిసిందేమీ లేదని అన్నారు. ఈ రెండున్నరేళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం గజ్వేల్‌లో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని ఆరోపించారు. ఎన్నికల తర్వాత రైతు బంధు ఇస్తామని ముఖ్యమంత్రి అంటున్నారని, కానీ ఈ నెల 11 లోపు ఇవ్వకపోతే ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధైర్యం ఉంటే అభివృద్ధి విషయంలో కేసీఆర్‌తో పోటీ పడాలని సవాల్ చేశారు.

# తెలంగాణను రక్షించుకోవాలంటే బీజేపీకి ఓటు వేయాలి: కిషన్‌రెడ్డి

**ఏపీలో ఎన్నో విమానాశ్రయాలు ఉన్నా తెలంగాణలో ఎందుకు లేవని ప్రశ్న**

**కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ బంగారు బాతు అయిందని విమర్శ**

**దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా తెలంగాణ నుంచే వెళుతున్నాయని ఆగ్రహం**



తెలంగాణను రక్షించుకోవాలంటే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఇన్నాళ్లు తెలంగాణలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలేనని, ఏపీలో విమానాశ్రయాలు ఉన్నాయి కానీ తెలంగాణలో ఎందుకు లేవని ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఏం చేసిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ బంగారు బాతు అయిందని విమర్శించారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా, తెలంగాణ నుంచే డబ్బులు వెళుతున్నాయని ఆరోపించారు. తెలంగాణను కాపాడుకోవాలంటే బీజేపీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు ఉన్న విషయం తెలిసిందే.

# హై రేంజ్ బిల్డింగ్ నిర్మాణాలపై జాతీయ సదస్సు

## సదస్సును ప్రారంభించిన జర్మనీకి చెందిన ప్రముఖ స్ట్రక్చరల్ ఇంజనీర్ మైక్ స్లైచ్



లకిడికపుల్ : ఫిబ్రవరి 05 ( వాయిస్ టుడే ): పర్యావరహణ హితంగా, హై రేంజ్ భవనాల నిర్మాణం, శాశ్వతమైన కట్టడాలు అనే అంశంపై ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్లో గురువారం నిర్వహించిన మూడు రోజుల స్ట్రక్ ఇ నాట్కాన్ - 2026 సదస్సు గురువారం ప్రారంభమైంది. సదస్సును జర్మనీకి చెందిన ప్రముఖ స్ట్రక్షరల్ ఇంజనీర్ ప్రొఫెసర్ మైక్ స్లైచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మైక్ స్లైచ్ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హై రేంజ్ భవనాల నిర్మాణం ఎలా చేపట్టాలి, ఎలాంటి నిర్మాణ సామాగ్రి ఉపయోగించాలి, ప్లానింగ్, నమూనా వంటి అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ స్ట్రక్షరల్ ఇంజనీర్స్ - నాట్కాన్ 2026 ఆర్గనైజింగ్ సెక్రటరి డాక్టర్ ఎస్.పి. అంచూరి మాట్లాడుతూ స్ట్రక్షరల్ ఇంజనీర్స్ సదస్సులో దేశంలో ప్రముఖ స్ట్రక్షరల్ ఇంజనీర్స్ పాల్గొన్నారని, మూడు రోజుల సదస్సులో 60 పేపర్లు, 12 మంది కీ నోట్ స్పీకర్లు, నిర్మాణ రంగంలో ఉన్న నిపుణులు పాల్గొని ప్రసంగిస్తారు. హై రేంజ్ భవనాలు (50 అంతస్తులు) ఎలా నిర్మించాలి, భూ కంపాలను ఎలా తట్టుకుంటాయి అనే అంశాలను తెలియజేస్తారన్నారు. మొదటి రోజు టెక్నికల్ స్ట్రక్షరల్ ఇంజనీరింగ్ విభాగంలో ఎలాంటి డెవలప్మెంట్ ఉన్నాయి, ఆధునిక టెక్నాలజీని ఎలా ఉపయోగించాలనే అంశాలను తెలియజేశారని, రెండవ రోజు నిర్మాణ రంగంలో ఎలాంటి మెటీరియల్ ఉపయోగించాలి, ఏఐ టెక్నాలజీ, నిర్మాణ రంగంలో పరికరాలు వాటి ఉపయోగం వంటి అంశాలపై, మూడవ రోజు నేషనల్ బిల్డింగ్ కోడ్, కొత్త మార్పులు, ఇంజనీర్ బిల్ గురించి నేషనల్ సెమినార్ లో చర్చిస్తామని తెలిపారు. సదస్సులో భాగంగా యుపిఎక్స్ పేరుతో ఎగ్జిబీషన్ ను వివిధ నిర్మాణ రంగ సంస్థలతో కలిసి ఏర్పాటుచేశారు. మొదటి రోజు సదస్సులో సైన్టిఫిక్ కమిటి చైర్మన్ హర్షవర్ధన్ సుబ్బారావు, సదస్సు జాయింట్ సెక్రటరీలు ఏడుకొండలు, కె. సాయినాథ్ తో పాటు యువ ఇంజనీర్లు, సైన్టిఫిక్ కమిటి సభ్యులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

## జనతా కాంగ్రెస్ నేషనల్ పార్టీ ఆధ్వర్యంలో ప్రతి నెల ప్రజా దర్బార్

### బోర్డు విలీనం అంశంపై అవసరమైతే ఢిల్లీలో ధర్నా చేపడతాం....

### జనతా కాంగ్రెస్ నేషనల్ పార్టీ...



సికింద్రాబాద్, ఫిబ్రవరి 05 (వాయిస్ టుడే ప్రతినిధి): ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని, ప్రతి నెల "ప్రజా దర్బార్" నిర్వహించి సమస్యలను స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తామని జనతా కాంగ్రెస్ నేషనల్ పార్టీ ప్రకటించింది. కంటోన్మెంట్ బోర్డు విలీనం అంశంపై అవసరమైతే ఢిల్లీలో ధర్నా చేపడతామని జనతా కాంగ్రెస్ నేషనల్ పార్టీ నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు గురువారం కంటోన్మెంట్ పరిధిలోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనతా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సర్వేందర్ మాట్లాడుతూ...రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా యాత్ర చేపట్టి ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కార దిశగా అడుగులు వేస్తామని చెప్పారు. అనంతరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గద్దం ఎబెల్ మాట్లాడుతూ.. కంటోన్మెంట్ విలీనం అంశంపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రాజకీయ నాటకాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. ఎమ్మెల్యే చేపట్టిన నిరసనకు స్పష్టమైన లక్ష్యం లేకపోవడంతోనే అది మధ్యలో ఆగిపోయిందన్నారు. గతంలోనే లక్ష సంతకాల సేకరణ చేసి కేంద్ర రక్షణ శాఖకు పంపినట్లు గుర్తు చేశారు. బీజేపీ నేతల వ్యాఖ్యలను ఖండిస్తూ, కంటోన్మెంట్ బోర్డు వద్ద బడ్జెట్ ఉందా? ఉంటే ప్రతి వార్డుకు ఎంత ఖర్చు చేస్తున్నారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. కేంద్రం నుంచి రావాల్సిన రూ.1200 కోట్ల నిధులు ఎందుకు రాలేదో చెప్పాలన్నారు. బోర్డు పరిధిలోని బీ-3, బీ-4 భూముల విషయంలో అధికారులు, రాజకీయ నాయకులు కుమ్మక్కై అక్రమ కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సామాన్యుల ఇళ్లపై మాత్రం కఠిన చర్యలు తీసుకుంటూ కూల్చివేతలు జరుపుతున్నారని విమర్శించారు. బడా బాబులకు వర్తించని నియమాలు పేదలకు ఎందుకు వర్తిస్తున్నాయో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బోర్డు విలీనం కోసం అవసరమైతే ఢిల్లీలో ధర్నా చేపట్టేందుకు వెనకాడబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనతా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సెక్రటరీ ఎన్. అశోక్ కుమార్ ముదిరాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేష్ ముదిరాజ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు కీజర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ప్రతాప్, అరుణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన లక్ష్యం

### పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

### 17 కోట్ల 33 లక్షల 80 వేల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 5(వాయిస్ టుడే): నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. గురువారం రూ.17 కోట్ల 33 లక్షల 80 వేల వ్యయంతో శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని తార నగర్, రైల్ విహార్, హుడా ట్రేడ్ సెంటర్,నల్లగండ్ల ఫ్లై ఓవర్, సురభి కాలనీ, భాగ్యలక్ష్మి ఎనక్లేవ్, మారుతి నగర్,మాధవ హిల్స్, స్ప్రింగ్ వ్యాలీ, వుడ్ ల్యాండ్ ప్రీమియర్, శిల్ప గార్డెన్,సెంట్రల్ పార్క్ ఫేస్ 1, సెంట్రల్ పార్క్ ఫేస్ 2, పెరల్ విలేజ్, క్యామ్లెట్ లే ఔట్, క్రాంతి వనం కాలనీల లో సీసీ రోడ్ల ,ఓపెన్ జిమ్, కమ్యూనిటీ హల్, స్పోర్ట్స్ కంప్లెక్స్, షటిల్ , బ్యాడ్మింటన్ ,పార్క్ ప్రహరీ గోడ నిర్మాణము పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలోఅభివృద్ధి చేసిఆదర్శవంతమైన అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదితానని తెలిపారు.అదేవిధంగా నల్లగండ్ల ఫ్లై ఓవర్ కింద ఆట విడుపు కోసం యువత కోసం బాక్స్ క్రికెట్, ఫుట్ బాల్ కోర్ట్, బ్యాడ్మింటన్ , షటిల్ కోర్ట్ లను ఏర్పాటు చేస్తున్నామని ఇక్కడి యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుత జీవన విధానంలో ప్రతి ఒక్కరూ విధిగా వ్యాయామలు చెయ్యటం ఎంతో అవసరమని, ఆరోగ్యం బాగుంటే మనిషి ఏదైనా సాధించగలడని, ఆరోగ్యమే మహా భాగ్యం అని, కాబట్టి ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరమన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, వీరేశంగౌడ్, అనిరుధ్ యాదవ్, తరుణ్ గౌడ్, రవి యాదవ్, కార్యకర్తలు, కాలనీ వాసులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అధ్యాపకులను నియమించాలని ఓయూ టెక్నాలజీ విద్యార్థుల ధర్నా...



సికింద్రాబాద్, ఫిబ్రవరి 05 (వాయిస్ టుడే ప్రతినిధి): విద్యార్థులకు సరిపడా అధ్యాపకులను నియమించాలని డిమాండ్ చేస్తూ ఓయూ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు ఉస్మానియా యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటీవ్ బిల్డింగ్ ఎదుట గురువారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. టెక్నాలజీ కళాశాలలోని నాలుగు డిపార్ట్మెంట్లలో 1200 నుంచి 1500 మంది విద్యార్థులకు పర్మినెంట్ ప్రొఫెసర్లు కేవలం ఐదుగురు, ఇద్దరు కాంట్రాక్టు, ముగ్గురు పార్టైం ప్రొఫెసర్లు మాత్రమే ఉన్నారని తెలిపారు. అందులోనూ ఫుడ్ టెక్నాలజీ డిపార్ట్మెంట్కు ఒక్కరు కూడా లేరని అన్నారు. రెండేండ్లగా ఇలాగే కొనసాగిస్తున్నరని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిసారీ టైంటేబుల్లో సబ్జెక్టు టీచర్ను సూచించేవారు కాదని, పీఈటీ అని రాసి వదిలేసే వారని, చివరకు ఉన్న ఐదుగురు ప్రొఫెసర్లే ఎక్కువ క్లాసులు చెప్తూ నెట్టుకొస్తున్నారని పేర్కొన్నారు. పార్టు, టైం అధ్యాపకులను నియమించాలని కాలేజీ నుంచి ప్రతి సంవత్సరం ప్రతిపాదనలు పంపుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. డీన్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. అయితే విద్యార్థుల ధర్నా అనంతరం పార్ట్ టైం అధ్యాపకులను వెంటనే నియమించుకోవాలని వీసీ నుంచి లెటర్ వచ్చినట్లు టెక్నాలజీ ప్రిన్సి పాల్ రమేష్ కుమార్ తెలిపారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: అనిల్ కుమార్ యాదవ్



శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 5 (వాయిస్ టుడే): ప్రజలు నమ్మి నిర్మించిన ప్రజా ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉమ్మడి శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోనీ ఆయా కాలనీలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గత పాలకులు నిర్వీర్యం చేసిన కాలనీలకు ప్రత్యేక నిధులు మంజూరు చేసి సీనియర్ సిటిజన్స్, మహిళలు, పిల్లలకు ఉపయోగకరంగా ఉండేలా పార్క్ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అస్తవ్యస్తంగా మారిన రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి మరమత్తు కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని సంకల్పించింది కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం స్థానిక శాసనసభ్యుడు ఆరెకపూడి గాంధీతో కలిసి స్థానిక ప్రజలతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అనిల్ కుమార్ యాదవ్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు ఉన్న తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలు సంఘాలు,కాలనీ కమిటీ సభ్యులు మాట్లాడుతూ రెండేండ్ల ప్రజా ప్రభుత్వంపై తమ నమ్మకాన్ని తెలియజేశారు. ధ్వంసమైన రాజ్యాన్ని పున:నిర్మిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై సంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటామని స్పష్టం చేస్తూ పదికాలాల పాటు రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. దేశంలో అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో మన హైదరాబాద్ ఒకటి అని అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. నగర అభివృద్ధికి నిధులు మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎంఎల్ఏ అరెకపూడి గాంధీ తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంకి సంబంధించి ఇప్పటికే మంజూరైన పనులను త్వరితగతిన పూర్తిచేసి అభివృద్ధిలో నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో ఉంచాలన్నదే లక్ష్యం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, యువజన, విద్యార్థి, కార్మిక, మహిళా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక అధ్యక్షుడిగా వేముల తిరుపతిరెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- ప్రతిష్టాత్మకమైన ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా వేముల తిరుపతిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. వర్కింగ్ ప్రెసిడెంట్ గా పి. సాగర్,ప్రధాన కార్యదర్శిగా గ్యరంపల్లి శివాజీ, ఉపాధ్యక్షులుగా 1. ఏ.వి. శ్రీధర్ రావు, 2. కూకట్ల నరోత్తమ్ రెడ్డి, కోశాధికారిగా గుత్తి శేఖర్, జాయింట్ సెక్రటరీగా దాస రాజు ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది ముఖ్య సలహాదారులుగా కొలనుపాక చంద్రమౌళి, దొంతుల వెంకటరామ్ రెడ్డి, కంచు శ్రీను,కోడి కంటి శ్రీనివాస్,ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన ఆడ్ హక్ కమిటీ సభ్యులైన వెంకట్రాంరెడ్డి, చంద్రమౌళి, మహేందర్ రెడ్డిలు వ్యవహరించారు.

నూతన అధ్యక్షుడికి బాధ్యతలు అప్పగించిన మాజీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన కమిటీ ఈ కమిటీ 2 సంవత్సరాల వరకు కొనసాగుతుంది అని తెలిపారు.అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం వేముల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ జర్నలిజం విలువలు కాపాడటం, పాత్రికేయుల హక్కుల పరిరక్షణ కోసం పాటుపడతానని అలాగే ప్రెస్ క్లబ్ సభ్యులు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఉప్పల్ ప్రాంతంలోని జర్నలిస్టులను ఒకే వేదికపై ఏకతాటిపైకి తీసుకువచ్చి, వారి సంక్షేమానికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రెస్ క్లబ్ ద్వారా సామాజిక బాధ్యత కార్యక్రమాలు చేపట్టడం, యువ జర్నలిస్టులకు మార్గనిర్దేశం చేయడం, అలాగే ప్రభుత్వ అధికారులతో సమన్వయం పెంచడం తమ కార్యాచరణలో భాగమని తిరుపతిరెడ్డి వెల్లడించారు. పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు.

## రూ.19 కోట్లతో ఉప్పల్ భగాయత్లో అభివృద్ధి పనులు

### సీఎంకు, ప్రభుత్వ పెద్దలకు ధన్యవాదాలు తెలిపిన కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):- ఉప్పల్ భగాయత్లోని హెచ్ఎండీఏ లే అవుట్లో ప్లాట్లను అమ్ముకొని గత ప్రభుత్వ పెద్దలు సొమ్ము చేసుకున్నారు. కానీ, ఇచ్చిన మాటను నిలుపుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి గారు అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేస్తూనే పోతున్నారు. పలు పనులకు ఏకంగా రూ.19 కోట్ల నిధులను మంజూరు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిగారికి, ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ పరమేశ్వర్‌రెడ్డిగారికి, ఇతర ప్రభుత్వ పెద్దలకు పేరుపేరునా ధన్యవాదాలు.

**మంజూరైన పనులు, నిధుల వివరాలు**

-రూ.9.80 కోట్లతో లే అవుట్‌లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం.

-రూ.6 కోట్లతో కమ్యూనిటీ సెంటర్ భవనానికి, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు కంపౌండ్ వాల్ నిర్మాణం. ఇదే కాకుండా ఒపెన్ జిమ్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా అభివృద్ధి, వాచ్‌మెన్ గది, గ్రీనరీ ఏర్పాటు, తదితర పనులను చేపట్టనున్నారు.

-రూ.3.10 కోట్లతో లే అవుట్‌లోని ఖాళీ స్థలాల పరిరక్షణకు కంపౌండ్ వాల్స్ నిర్మాణం.

త్వరలో.. -రూ.10 కోట్లతో లే అవుట్‌లో రోడ్ల నిర్మాణం, మరమ్మతు పనులు.

-రూ.3 కోట్లతో కమ్యూనిటీ సెంటంనిర్మాణం.



## ఎయిర్‌టెల్ ఉద్యోగులకు ప్రత్యేక ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం

సికింద్రాబాద్, ఫిబ్రవరి 05 (వాయిస్ టుడే ప్రతినిధి):: రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేయడం, బాధ్యతాయుతమైన రహదారి ప్రవర్తనను ప్రోత్సహించాలనే లక్ష్యంతో, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ బేగంపేట పరిధిలోని బేగంపేట ఎయిర్‌టెల్ భవనంలో, ఎయిర్‌టెల్ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని తిరుమలగిరి డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) జి. శంకర్ రాజు ప్రారంభించి ఎయిర్టెల్ ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. క్రమశిక్షణతో వాహనాలు నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించి అమూల్యమైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ, సమాజంలో ఇతరులకు కూడా అవగాహన కల్పించేలా రోడ్డు భద్రత అంబాసిడర్లుగా మారాలని ఉద్యోగులను కోరారు. ఈ కార్యక్రమం ద్వారా ఉద్యోగులు తమ స్వంత భద్రతతో పాటు ఇతర రహదారి వినియోగదారుల భద్రతను కాపాడుకోవాలంటే ట్రాఫిక్ నిబంధనలు కట్టుదిట్టంగా పాటించాల్సిన అవసరం పై అవగాహన కల్పించారు. ముఖ్యంగా అతివేగం వల్ల కలిగే ప్రమాదాలు, మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, హెల్మెట్, సీటు బెల్ట్‌ల తప్పనిసరి వినియోగం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం వల్ల కలిగే ప్రమాదాలు, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం మరియు లేన్ డిసిప్లిన్ వంటి అంశాలపై విపులంగా వివరించారు. ఈ కార్యక్రమానికి హీరో మోటార్స్ నుండి సాదిక్, ప్రవీణ్ (మేనేజర్), ఎయిర్‌టెల్ సీఈఓ అజయ్ అనంత్ పద్మనాభన్, నోడల్ హెడ్ గీత, నోడల్ ఆఫీసర్ సంతోష్ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని జూమ్ వేదిక ద్వారా లైవ్ గా ప్రసారం చేయగా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన సుమారు 2,000 మంది ఎయిర్‌టెల్ ఉద్యోగులు జూమ్ ద్వారా ఆన్‌లైన్‌లో పాల్గొని ఈ అవగాహన సదస్సును వీక్షించి లబ్ధి పొందారు. కార్యక్రమంలో ఉద్యోగులు చురుకుగా పాల్గొని ట్రాఫిక్ నియమాలు, సురక్షిత డ్రైవింగ్‌కు సంబంధించిన తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నగరవ్యాప్తంగా ట్రాఫిక్ ఉల్లంఘనలను తగ్గించి, రోడ్డు భద్రతా సంస్కృతిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

వాయిస్ టుడే

హైదరాబాద్
శుక్రవారం 6 ఫిబ్రవరి 2026

# సామాన్య భక్తులే వీఐపీలు..

**అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి..**

**బీరంగూడ గుట్ట పైన 24 గంటల్లోగా అక్రమణలు తొలగించండి..**

**మూడు రోజులపాటు ం ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్..**

**భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు..**

**3 లక్షల మందికిపైగా భక్తులు దర్శించుకునే అవకాశం**

**ఉత్సవాలు ప్రారంభమయ్యేంలోపు మరోసారి సమీక్ష**

**మహాశివరాత్రి పర్వదినం జాతర పై సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్**

అమీన్పూర్ (వాయిస్ టుడే): రాష్ట్రంలోనే ప్రసిద్ధ శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజులపాటు నిర్వహించనున్న మహా జాతర సందర్భంగా సామాన్య భక్తులకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ.. ప్రణాళికా ప్రకారం నిర్దేశించిన పనులను పూర్తి చేసి



విజయవంతం చేయాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఐదు రోజులపాటు నిర్వహించనున్న జాతర సందర్భంగా గురువారం ఉదయం ఆలయ ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 14 నుండి 18వ తేదీ వరకు శివరాత్రి జాతర వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించాలని ఆదేశించారు. శివరాత్రి సందర్భంగా స్థానిక భక్తులతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు నాలుగు లక్షల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకునే అవకాశం ఉందని తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దర్శన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ఐదు రోజులపాటు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఈవో శశిధర్మం ఆదేశించారు. నిరంతర నిఘా కోసం 50 కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు రద్దీ నివారణకు ఆధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. దేవాలయం ఆవరణలో గల కబ్జాలను 24 గంటల్లోగా తొలగించాలని ఎమ్మార్వో వెంకటేష్ ను ఆదేశించారు. ఇదే అంశంపై గతంలోనూ తెలపడం జరిగిందని.. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. దర్శనాల అంశంలో వీఐపీల పేరుతో సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించవద్దని.. భక్తుల సంఖ్యకు అనుగుణంగా క్యూలైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతర ఏర్పాట్లపైన ఈనెల 12వ తేదీన మరో మారు సమీక్ష సమావేశం నిర్వహించనున్నామని.. అప్పటి లోపు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్, తహసిల్దార్ వెంకటేష్, అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, సిఐ నరేష్, ఆలయ ఈవో శశిధర్, ఆలయ కమిటీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మె ను జయప్రదం చేయండి

**4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలి**

**ఆశా వర్కర్లకు రూ.26 వేల వేతనం, రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలి**

నాచారం (వాయిస్ టుడే ):తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని యూనియన్ నాయకులు లత పిలుపునిచ్చారు. గురువారం మల్లాపూర్ యు.పి.హెచ్.సి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లతో కలిసి ఆరోగ్య కేంద్ర డాక్టర్కు తమ డిమాండ్లతో కూడిన మెమొరండంను సమర్పించారు.ఈ సందర్భంగా యూనియన్ నాయకులు లత, సిఐటియు మేడ్చల్ జిల్లా నాయకులు ఉన్నికృష్ణ లు మాట్లాడుతూ... ఆశా వర్కర్లపై పెరుగుతున్న పనిభారం, తగిన వేతనం లేకపోవడం, ఉద్యోగ భద్రత లేకుండా పనిచేయాల్సిన పరిస్థితులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. ప్రజారోగ్య వ్యవస్థలో కీలకంగా పనిచేస్తున్న ఆశా వర్కర్లకు కనీస హక్కులు కూడా కల్పించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఆశా వర్కర్లకు నెలకు కనీస వేతనం రూ.26,000, పెన్షన్ రూ.10,000 మంజూరు చేయాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ను వెంటనే రద్దు చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ సమ్మె అవసరమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ యు.పి.హెచ్.సి ఆశా వర్కర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఇస్నాపూర్ కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థుల మద్యం పట్టివేత



వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : ఇస్నాపూర్ మున్సిపల్ లో 12 మరియు 14 వార్డుల కాంగ్రెస్ అభ్యర్థులు గడ్డం శ్రీశైలం మరియు గడ్డం బాలమణి గారి తనయుడు మరియు వారి అనుచరులు ఓటర్లకు మద్యం పంచుతుండగా అడ్డుకుని పోలీసులకు అప్పజెప్పిన బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలపై దౌర్జన్యానికి పాల్పడిన శ్రీశైలం అనుచరులు....

## బచ్చుగూడలో బీఆర్ఎస్కు గట్టి ఎదురుదెబ్బ

**కాంగ్రెస్ పార్టీలోకి చేరిన కీలక నాయకులు**

**అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ -- కాట శ్రీనివాస్ గౌడ్**




వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని బచ్చుగూడ 15వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సరిత భుజంగారెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఉప సర్పంచ్ జంగారెడ్డి, ప్రముఖ నాయకులు కరుణాకర్ రెడ్డి, దయాకర్ రెడ్డి, కిష్టారెడ్డి, నవాబ్ గౌడ్, నాగార్జున రెడ్డి తదితరులు తమ అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ పార్టీలో చేరిన నాయకులకు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ ఇంచార్జి నీలం మధు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బచ్చుగూడ గ్రామ ప్రజలందరూ ఐక్యంగా నిలబడి కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి, 15వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి సరిత భుజంగారెడ్డి ని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇప్పటి వరకు పరిష్కారం కాని వీధి దీపాల సమస్య, త్రాగునీటి సమస్య, మౌలిక వసతుల కొరత వంటి ప్రజా సమస్యలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాధాన్యతతో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బచ్చుగూడ గ్రామ అభివృద్ధి, సంక్షేమం, నిజమైన ప్రజాపాలన కోసం ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ప్రజలను కోరారు.




## క్యాట్ లెవెల్ -2 ఒలింపియడ్స్ లో ప్రతిభ కనబరిచిన బర్కత్ పుర శ్రీ చైతన్య విద్యార్థులు

హైదరాబాద్, ఫిబ్రవరి 05:వాయిస్ టుడే: శ్రీ చైతన్య స్కూల్, బర్కత్ పుర బ్రాంచ్ విద్యార్థులు క్యాట్ లెవెల్ -2 ఒలింపియడ్స్ పరీక్షలు 2025--26లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి ఘన విజయాన్ని సాధించారు. ఈ పరీక్షల్లో బర్కత్ పుర బ్రాంచ్కు చెందిన విద్యార్థులు 8 క్యాష్ ప్రైజులు, మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లు సాధించడం విశేషం. అలాగే 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు పలువురు విద్యార్థులు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లు పొందారు. ఈ సందర్భంగా ఏజీఎం మహమ్మద్ నూర్ అలీ, జోనల్ కోఆర్డినేటర్ రాజేంద్ర ప్రసాద్, ప్రిన్సిపల్ మాధవి, డీన్ గాయత్రి, ఇన్చార్జ్లు విద్యార్థులను అభినందిస్తూ ఈ విజయాలు క్రమబద్ధమైన బోధన, నిరంతర అకడమిక్ మార్గదర్శకత్వానికి నిదర్శనమని తెలిపారు. పాఠశాల విద్యా విధానంపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు.




## ప్రచారం ప్రారంభించిన నీలం మధు, కాట శ్రీనివాస్ గౌడ్..

**ఇంద్రేశం మున్సిపాలిటీ లో కాంగ్రెస్ అభ్యర్థుల తరపున ప్రచారం...**

**అభివృద్ధి కొనసాగాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని వినతి...**

**కాంగ్రెస్ లో చేరిన పలు పార్టీల నాయకులు..**

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్, పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ లు కలిసి కాంగ్రెస్ ప్రచారాన్ని నిర్వహించారు. గురువారం ఇంద్రేశం మున్సిపాలిటీలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఇద్దరు నేతలు కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. మున్సిపాలిటీ పరిదిలో వార్డు నంబర్ 15 బచ్చుగుడా లో కాంగ్రెస్ అభ్యర్థి సరితను గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన ఆరు గ్యారెంటీలు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. పటాన్ చెరు ప్రాంత అభివృద్ధి కి కాంగ్రెస్ ప్రత్యేక ప్రణాళిక తో ముందుకు సాగుతుందని తెలిపారు. ఇప్పటికే ఇంద్రేశం మున్సిపాలిటీకి రూ.15 కోట్ల ప్రత్యేక నిధులను అందించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని, ఆ నిధులతో ప్రజల మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తూ పనులు ప్రారంభిస్తామని వివరించారు.

అధికారంలో ఉన్న పార్టీ గెలిస్తేనే అభివృద్ధి సాధ్యమని ప్రజలంతా విజ్ఞతతో ఆలోచించి చెయ్యి గుర్తు పై ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పలు పార్టీల నేతలు కరుణాకర్ రెడ్డి, దయాకర్ రెడ్డి, కిష్ట రెడ్డి, వెంకట్ రెడ్డి, 40 మంది తదితరులు కాంగ్రెస్ లో చేరారు. వారికి నీలం మధు, కాట శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

## వడ్డెరులంతా మున్సిపాలిటీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలి

**అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రమేష్ మంజాల**



హైదరాబాద్, ఫిబ్రవరి 05: (వాయిస్ టుడే): వడ్డెర సామాజికవర్గానికి సంక్షేమ పథకాల అమలు, వడ్డెర ఫెడరేషన్ సంఘాలకు, కాంట్రాక్టర్లకు ప్రభుత్వ పరంగా లబ్ధి చేకూరే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి చేస్తున్న ముమ్మర ప్రయత్నాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి భారీ మెజారిటీ తో గెలిపించాలని అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రమేష్ మంజాల విజ్ఞప్తి చేసారు. హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో గురువారం జరిగిన విలేఖరుల సమావేశంలో సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు రాపెన్ గిరిబాబు తోకలసి రమేష్ మంజాల మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వడ్డెరులకు తీవ్ర అన్యాయం జరిగిందని, వడ్డెరులకు సంక్షేమ పథకాలు అమలు చేయకుండా వారి మనోభావాలు దెబ్బ తీసారని ఆవేదన వ్యక్తం చేసారు. అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు వేముల లక్ష్మణ్, జాతీయ ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్ వడ్డెరుల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, మొత్తం సమస్యలన్నీ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతోపాటు స్వాతంత్ర సమరయోధులు వడ్డే ఓబన్న గారి జయంతిని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా జరిపించిందని తెలిపారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయాలలో సామజిక న్యాయం కోసం బీసీ గ్రూప్ లో ఉన్న వడ్డెరులను ఎస్టీ గ్రూప్ లో చేర్చాల్లన్న దృఢ నిశ్చయంతో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఈ మున్సిపాలిటీ ఎన్నికలలో బలపరచి వలసిన అవసరముందని, వడ్డెరులంతా సంఘటితమై కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అలాగే హైదరాబాద్, ఖమ్మం, వరంగల్, నల్గొండ తదితర మున్సిపల్ కార్పొరేషన్ లకు జరగబోయే ఎన్నికల్లో రాజకీయంగా వెనుకబడి ఉన్న వడ్డెరులకు కాంగ్రెస్ పార్టీ న్యాయబద్ధమైన వాటా ఇవ్వాలని కోరారు. సంఘాన్ని రాష్ట్ర స్థాయిలో పటిష్టం చేసేందుకు త్వరలో అన్ని జిల్లాలు పర్యటించి, వడ్డెరులను జాగృతి పరిచే సమావేశాలు నిర్వహిస్తామని రమేష్ మంజాల వెల్లడించారు.

# గ్రేటర్లో త్వరలో న్యాయవాదుల రక్షణ చట్టం సాధన కమిటీ ఏర్పాటు

**-- నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె. రవికిషోర్**

హైదరాబాద్; ఫిబ్రవరి 5(వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్రంలో న్యాయవాదులపై రోజు రోజుకి పెరుగుతున్న దాడులు, హింసాత్మక ఘటనలను అరికట్టేందుకు తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ల కార్యవర్గంతో చర్చించి త్వరలోనే న్యాయవాదుల రక్షణ చట్టం సాధన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు, తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి కె. రవికిషోర్ తెలిపారు. మహిళా న్యాయవాది జి. స్వప్న (34) దారుణ హత్యను నిరసిస్తూ మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాంపల్లి కోర్టు భవన సముదాయం ప్రధాన ద్వారం వద్ద న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వెంటనే న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని, నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే న్యాయవాదుల ఐక్యత వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు.

ఈ సమావేశంలో వక్తలు భాను చంద్రిక, రేణుక, కొండూరు వినోద్ కుమార్, రెట్టల బాలరాజ్, డి. వెంకటేష్, రాజిరెడ్డి తదితరులు మాట్లాడుతూ, హతురాలు న్యాయవాది జి. స్వప్నపై గతంలోనే రెండు సార్లు హత్యాయత్నాలు



జరిగాయని, తనకు ప్రాణహాని ఉందని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి రక్షణ కల్పించకపోవడం పోలీస్ శాఖ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని తీవ్రంగా విమర్శించారు. సంబంధిత పోలీస్ అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు.

న్యాయవాదులపై జరుగుతున్న దాడి కేసులపై ఎలాంటి జాప్యం లేకుండా సత్వర విచారణ జరిపేందుకు ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని, న్యాయవాదుల హంతకులకు కఠిన శిక్షలు విధించాలని ప్రభుత్వాన్ని కోరారు. వృత్తి ధర్మంలో భాగంగా అన్ని వర్గాలకు, ప్రభుత్వ శాఖలకు, సామాన్య ప్రజలకు న్యాయం కోసం పోరాడే న్యాయవాదుల ప్రాణాలకు రక్షణ లేకపోవడం అత్యంత శోచనీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ గౌడ్, ఉపాధ్యక్షులు జి. చంద్రమోహన్, అబ్దుల్ ఖదీర్, వెంకటేష్ యాదవ్, గంప వెంకటేష్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.





# ప్రజాపాలన కాదు... ప్రజావేదన పాలన కొనసాగుతోంది : ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

కేసముద్రం, ఫిబ్రవరి 6: (వాయిస్ టుడే) రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్నది ప్రజాపాలన కాదని, ప్రజావేదన--ప్రజారోదన పాలన కొనసాగుతోందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారని, ఎన్నికల ముందు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేరలేదని ఆయన విమర్శించారు. మునిసిపల్ ఎన్నికల సందర్భంగా కేసముద్రం పట్టణంలో గురువారం సాయంత్రం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సభలో మాజీ ఎంపీ మాలోతు కవిత, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్, సంప్రదాయేతర ఇంధన వనరుల సంస్థ మాజీ ఛైర్మన్, ఎన్నికల ఇన్‌చార్జి వై. సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులకు పాలన చేతకాక ప్రధాన ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ ప్రజల దృష్టిని మళ్లించే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. లంబాడీలు, మున్నూరుకాపులు, యాదవులు, రజకులకు మంత్రి పదవులు ఇవ్వకుండా కాంగ్రెస్ తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని మోసం చేసిందని విమర్శించారు. అన్ని రంగాలలో అణచివేయబడుతున్న బీసీలకు రిజర్వేషన్లు పెంచాలనే డిమాండ్‌తో తాను పార్లమెంటులో ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టినట్లు ఆయన తెలిపారు. వాగ్దానాలు నెరవేర్చక పోగా బెదిరింపులకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి కేసముద్రం, మహబూబాబాద్ మునిసిపాలిటీల్లో బీఆర్ఎస్‌కు ఘన విజయం అందించి మహానేత కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సభలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మర్రి రంగారావు, యాకుబ్ రెడ్డి, రవిచంద్రారెడ్డి, నారాయణరావు తదితరులు పాల్గొ న్నారు. పెద్ద సంఖ్యలో హాజరైన స్థానికులు బీఆర్ఎస్‌కు అనుకూలంగా, కాంగ్రెస్ పాలనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



## జూబ్లీహిల్స్‌లో రూ.1.38 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (వాయిస్ టుడే): షేక్‌పేట్ డివిజన్ పరిధిలోని ఓయూ కాలనీలో డ్రైనేజీ మరియు వాటర్‌లైన్ పనులకు రూ.1 కోటి 38 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో జూబ్లీహిల్స్ ప్రాంతం గతంలో ఎన్నడూలేని విధంగా అభివృద్ధిలో ముందుకు సాగుతోందన్నారు. ఇప్పటికే మంత్రులు పొన్నం ప్రభాకర్, గడ్డం వివేక్ వెంకటస్వామి జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.200 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. షేక్‌పేట్ డివిజన్‌లో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మౌలిక సదుపాయాల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులు వేగంగా పూర్తి చేయించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. షేక్‌పేట్ డివిజన్‌ను అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపే దిశగా పనిచేయడం తమ లక్ష్యమని ఎమ్మెల్యే నవీన్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ సేవాదళ్ అధ్యక్షుడు దాయం శేఖర్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, జిహెచ్ఎంసి అధికారులు, జలమండలి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రంలో దుష్టపాలన కొనసాగుతోంది

### ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

పాల్వంచ, ఫిబ్రవరి 6: వాయిస్ టుడే: రాష్ట్రంలో దుష్టపాలన కొనసాగుతోందని, అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేరలేదని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర విమర్శించారు. పాలన చేతకాక కాంగ్రెస్ నాయకులు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 48వ డివిజన్ పాల్వంచ జగ్గు తండాలో గురువారం మధ్యాహ్నం ఎంపీ వద్దిరాజు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, ఆయన కుమారుడు రాఘవలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ 432 హామీలు ఇచ్చి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేసిందని తీవ్రంగా విమర్శించారు.

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు 2014 జూన్ 14న అసెంబ్లీలో మహిళలు, బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటూ తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయాన్ని ఎంపీ వద్దిరాజు గుర్తు చేశారు. అలాగే గిరిజనులకు ఉన్న 6 శాతం రిజర్వేషన్లను 10 శాతానికి పెంచిన మహానేత కేసీఆర్ అని కొనియాడారు. రేవంత్ రెడ్డి పాలనలో బీసీలకే కాకుండా గిరిజనులకు కూడా తీవ్ర అన్యాయం జరుగుతోందని, మున్నూరు కాపు, యాదవ్, రజక, లంబాడ వర్గాలకు మంత్రి పదవులు ఇవ్వలేదని ఆరోపించారు. కేసీఆర్ తండాలు, గుడేలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజనుల ఆత్మగౌరవాన్ని పెంచారని తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి చెందిన తెలంగాణ ఎంపీలు 8 మంది ఉన్నప్పటికీ రాష్ట్రానికి తగిన నిధులు తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని నెరవేర్చకపోగా ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి వేధిస్తున్నదని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పెట్టడమే కాక అన్ని రంగాల్లో ప్రగతిపథాన పరుగులు పెట్టించిన కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చి అవమానించిన రేవంత్ రెడ్డికి తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్‌ను కైవసం చేసుకుని మహానేత కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని ఎంపీ వద్దిరాజు ఓటర్లను కోరారు.

## ఒక్కసారి అవకాశం ఇవ్వండి - అభివృద్ధి చేసి చూపిస్తా

### 26 వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతా: సిర్రం శిరీష-ప్రసాద్



వేములవాడ, ఫిబ్రవరి 5 (వాయిస్ టుడే) : వేములవాడ మున్సిపాలిటీ 26వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ఒక్క అవకాశం ఇస్తే వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కాంగ్రెస్ అభ్యర్థి సిర్రం శిరీష- ప్రసాద్ అన్నరు. గురువారం ఇంటింటి ప్రచారంలో భాగంగా వార్డులోని పలు వీధుల్లో ప్రచారం నిర్వహించి ఓటువేయాలని అభ్యర్థించారు. సిర్రం శిరీష మాట్లాడుతూ వార్డులో డ్రైనేజీ, రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉందని, తానుగెలిచిన వెంటనే రోడ్ల అభివృద్ధికి పెద్దపీటవేస్తానని తెలిపారు. 26వ వార్డు ప్రజలందరూ నన్ను మీఇంట్లో ఆడ బిడ్డల ఆదరిస్తారని మీకు సేవ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థినిగా పోటీ చేస్తున్న నన్ను భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. చేతి గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## రైతు సంక్షేమ పథకాలకు గుర్తుగా ముఖ్యమంత్రికి నాగలి బహుకరించిన గ్రంథాలయ చైర్మన్

కరీంనగర్,ఫిబ్రవరి 05(వాయిస్ టుడే):రాష్ట్రంలో రైతు సంక్షేమ పథకాలను దిగ్విజయంగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కరీంనగర్ గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం నాగలిని బహుకరించారు. చొప్పదండి మండలంలో జరిగిన ముఖ్యమంత్రి పర్యటనలో బాగంగా జరిగిన బహిరంగ సభలో సత్తు మల్లేశం ముఖ్యమంత్రిని కలిసి నాగలిని అందించారు.





## కాంగ్రెస్ అంటే సంక్షేమానికి మారుపేరు: ప్రణవ్

- ఇంటి,ఇంటికి ప్రచారం నిర్వహించిన ప్రణవ్.
- సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి అభివృద్ధికి తోడ్పడుతాం..

జమ్మికుంట ఫిబ్రవరి 5 (వాయిస్ టుడే): కాంగ్రెస్ అంటే సంక్షేమానికి మారుపేరని,ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమాన్ని ప్రజలకు చేరవేయడంలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించడం ద్వారా మరింతగా గడప,గడపకు చేరవేస్తామని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. గురువారం రోజున జమ్మికుంట పట్టణంలోని 22,19,04 వార్డులలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా ఇంటి ఇంటి ప్రచారాన్ని నిర్వహించారు. ప్రచార సమయంలో కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలను,వాటి ద్వారా ప్రజలకు ఎంత మేలు జరుగుతుందో ప్రజలకు వివరించారు. జమ్మికుంట,హుజూరాబాద్ మున్సిపాలిటీల అభివృద్ధి నా బాధ్యత అని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట పట్టణ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సర్కార్ పనితీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

కొత్తగూడెం, ఫిబ్రవరి 6: వాయిస్ టుడే: కాంగ్రెస్ సర్కార్ పనితీరుపై బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాలలో గొప్పగా అభివృద్ధి చెందగా, కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్రం అధోగతి పాలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 10వ డివిజన్ బూడిదగడ్డ, 58వ డివిజన్ హనుమాన్ బస్తీ, 25వ డివిజన్ ఏ పవర్ హౌస్ బస్తీలలో ఎంపీ వద్దిరాజు విస్తృత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ కాపు సీతామహాలక్ష్మి, మాజీ వైస్ ఛైర్మన్ వేల్పుల దామోదర్, అభ్యర్థులు వేల్పుల వీరమ్మ, ఏమునూరి శివకృష్ణ, వేముల ప్రసాద్ బాబు, నాయకులు కొట్టి వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, నవతన్ తదితరులతో కలిసి కాలినడకన వీధివీధి తిరుగుతూ ఇంటింటికి వెళ్లి కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌కు ఘన విజయం చేకూర్చాలని ఓటర్లను కోరారు.

ఈ సందర్భంగా పలుచోట్ల ప్రజలను ఉద్దేశించి ఉత్తేజిత ప్రసంగాలు చేసిన ఎంపీ వద్దిరాజు, విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పాలకులు అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా మరిచిపోయారని విమర్శించారు. ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం అరాచక పాలన కొనసాగుతోందని, ఇది కేసుల--పోలీసుల ప్రభుత్వమని ఆయన వ్యాఖ్యానించారు. అక్రమ కేసుల బనాయింపు, విచారణలు, బెదిరింపులు, వేధింపులు, అరెస్టులకు భయపడబోమని స్పష్టం చేస్తూ, ప్రజలకు కొండంత అండగా కేసీఆర్ ఉన్నారని ఎంపీ వద్దిరాజు ధైర్యం చెప్పారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థ అని, పాలకుల పనితీరును ప్రజలు నిశితంగా గమనిస్తున్నారన్న విషయాన్ని డీజీపీ శివధర్ రెడ్డి గుర్తించుకుంటే మంచిదని సూచించారు.

ప్రజలు కేసీఆర్ పదేళ్ల పాలనను, రేవంత్ రెడ్డి రెండేళ్ల ప్రభుత్వాన్ని పోల్చి చూస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులకు భంగపాటు తప్పదని ఎంపీ వద్దిరాజు స్పష్టం చేశారు. సుమారు 6 కిలోమీటర్ల వరకు



కాలినడకన కొనసాగిన ఈ ప్రచార కార్యక్రమంలో వందలాది మంది కార్యకర్తలు, అభిమానులు గులాబీ జెండాలు చేతబూని, కండువాలు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. "జై తెలంగాణ జైజై తెలంగాణ", "జిందాబాద్ జిందాబాద్ బీఆర్ఎస్ జిందాబాద్", "వర్థిల్లాలి వర్థిల్లాలి కేసీఆర్ నాయకత్వం వర్థిల్లాలి", "కారు గుర్తుకే మన ఓటు", "గెలిపిద్దాం గెలిపిద్దాం కారు గుర్తుకు ఓటేసి గెలిపిద్దాం" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ ఎన్నికల ఇన్‌చార్జిగా తమ డివిజన్లలో ప్రచారం కోసం విచ్చేసిన ఎంపీ వద్దిరాజుకు మహిళలు హారతులిచ్చి, బొట్టు పెట్టి ఘనంగా స్వాగతం పలికారు. అభ్యర్థులు శాలువాలు కప్పి సత్కరించారు.



## సీఎం సభతో అక్రమ అరెస్టులు తగవు

**సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి**




కరీంనగర్,ఫిబ్రవరి 05(వాయిస్ టుడే): చొప్పదండి సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ఎలాంటి పిలుపు లేకున్నా సిపిఎం నాయకులను అక్రమ అరెస్టు చేయడం తగదని సిపిఎం జిల్లా కార్యదర్శి వాసుదేవ రెడ్డి అన్నారు. పోలీసులు ఉదయం సిపిఎం నాయకులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడం సరికాదన్నారు.ప్రజాస్వామ్య పాలన పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా గత బిఆర్ఎస్ పాలన లాగానే నియంతృత్వ పోకడలతో ముందుకు వెళుతుందన్నారు.ప్రజా పాలన అంటే అక్రమ అరెస్టులు చేయడమేనా?అని ప్రశ్నించారు.అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను అనచలేరన్నారు.ఇలాగే నియంతృత్వ పోకడలతో ముందుకెళ్తే టిఆర్ఎస్ పార్టీకి పట్టిన గతే కాంగ్రెస్ కు పడుతుంది అన్నారు.



## అందరికీ న్యాయం చేస్తాం,కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయండి

**కలిసి పని చేయాలని కోరిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

కరీంనగర్, ఫిబ్రవరి 05 (వాయిస్ టుడే): వివిధ డివిజన్లలో పార్టీ టికెట్ ఆశించి టికెట్ రాక పోవడంతో రెబల్స్ గా పోటీ లో ఉన్న అభ్యర్థులు మరియు నామినేషన్ వేసి ఉపసంహరించుకున్న నాయకులకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్ లో మంత్రి శ్రీధర్ బాబును కలిసారు. ఈ సందర్భంగా పలువురు మంత్రి శ్రీధర్ బాబుతో నాయకులు మాట్లాడుతూ కష్ట కాలంలో పార్టీ కోసం పని చేసినం మాకు పార్టీ టికెట్ రాకపోవడం బాధాకరమని అని అన్నారు.ఏదో విధంగా అందరికీ అవకాశం కల్పించి అందరికీ న్యాయం చేస్తామని పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేయాలని మీమీ డివిజన్లలో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని పార్టీ అందరికీ న్యాయం చేస్తుందని శ్రీధర్ బాబు సూచించారు.ఈ సమావేశంలో ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. వివిధ డివిజన్ల నుండి నాయకులు షబానా మహమ్మద్, కుదురత్ ఉన్నీసా బేగం,ఖంరోద్దీన్ చర్ల పద్మ,గడమల్ల శ్రీనివాస్,ముల్కల కవిత,అస్థాపురం రమేష్,యనమల మంజుల,జిడి రమేష్,చాంద్ పాషా ఉప్పరి అజయ్,గంగుల దిలీప్, సుదర్శన్,హనీఫ్,యోనా పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి క్రీడా పోటీలకు బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ విద్యార్థిని ఎంపిక



వరంగల్ ( వాయిస్ టుడే ) ఫిబ్రవరి 05: నగరంలోని రంగశాయిపేట శివారు లో గల బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ కు చెందిన విద్యార్థులు గురువారం హైదరాబాద్ నాంపల్లి లోని ఎల్.బి. స్టేడియంలో జరిగిన నేషనల్ త్రోబాల్ ట్రయల్ సెలెక్షన్స్ లో పాల్గొన్నారు. ఈ సెలెక్షన్స్ కు వివిధ పాఠశాలల నుండి మొత్తం 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సెలక్షన్స్ లో బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ కు చెందిన గ్రేడ్ లెవన్ విద్యార్థిని బి. మనస్వి త్రోబాల్ నేషనల్స్‌కు ఎంపికయ్యింది. ఇట్టి త్రోబాల్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌లు తిరుపతిలో మార్చి 13 నుండి 15వ తేదీ వరకు నిర్వహించబడనున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఎన్. వెంకటేశ్వర రావు విద్యార్థిని మనస్వి నినీ, ప్రిన్సిపల్ జయప్రకాశ్ అలాగే కోచ్ ప్రశాంత్ లను అభినందించారు.






# చొప్పదండిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

కరీంనగర్,ఫిబ్రవరి 05 (వాయిస్ టుడే):చొప్పదండి మండలం గుమ్లాపూర్ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు,పొన్నం ప్రభాకర్ శ్రీధర్ బాబు,అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు అయ్యారు. 45.15 కోట్లతో కరీంనగర్ జిల్లా రామడుగులో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు శంకుస్థాపన. రూ.5 కోట్లతో కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధురానగర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మీ అందరి ఆశీర్వాదం తో ఉత్తర తెలంగాణ లోని కరీంనగర్ జిల్లాలో 13 కి 8 మంది శాసన సభ్యులను గెలిపించారు.గత 10 సంవత్సరాలుగా ఈ ప్రాంతం నిర్లక్ష్యానికి గురైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యా, వైద్యం,ఇరిగేషన్ అన్ని రంగాల్లో జిల్లాను అనుభవజ్ఞులైన ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావుసారధ్యంలో జిల్లాను అగ్రగామిగా ఉంచే ప్రయత్నంలో అభివృద్ధి కార్యక్రమంలో శాసన సభ్యులు, మంత్రులం కలిసి వెళ్తున్నాం.నేరుగా పేద ప్రజల ఇళ్లకు వెళ్తున్న సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్న ప్రభుత్వం మీద అసహనంతో మాట్లాడుతున్న ప్రతిపక్షాలు చూస్తున్నాం. శాసనసభ ఎన్నికల్లో మీ ఆశీర్వాదంతో ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడింది.గత పార్లమెంట్ ఎన్నికల్లో మీకు సున్నా సీట్లు ఇచ్చారు. ఉప ఎన్నికలు,సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించారు.కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉన్న ప్రజా పాలన ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆశీర్వదించి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి. ఉమ్మడి జిల్లాలో ప్రతి మున్సిపాలిటీ లో కాంగ్రెస్ పార్టీనీ గెలిపించాలి. ప్రధాన మంత్రి స్వయంగా తెలంగాణ పట్ల వివక్షపూరితంగా మాట్లాడారు బీజేపీ నేతలు స్పందించలేదు.ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్య మంత్రి, మంత్రులు ప్రధాన మంత్రినీ బడ్జెట్ లో అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించాలని కలిసి విజ్ఞప్తి చేశాం. రెండు బడ్జెట్‌లలో నిధులు కేటాయించలేదు .తెలంగాణ పై విషం చిమ్ముతున్న పవన్ కళ్యాణ్‌తో తెలంగాణ బీజేపీ పొత్తుపెట్టుకొనిపెట్టుకొని ప్రజల్లోకి వస్తుంది. తెలంగాణకి నిధులు ఇవ్వకుండా చిన్నచూపు చూస్తు న్నారు. తెలంగాణ కల్లుపడితే ఆంధ్రా కొబ్బరి చెట్లు ఎండి పోతున్నాయని విమర్శించారు.కొండగట్టు వస్తె ఉప ముఖ్యమంత్రిగా స్వాగతం పలికాం. తెలంగాణ ప్రజలను అవమాన పరిచిన తెలంగాణ ఏర్పాటు పట్ల వివక్ష పూరితంగా మాట్లాడిన ఎవరు చూస్తూ ఊరుకోరు అన్నారు.

## కూరగాయల సాగుతూ రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలి

**హక్దర్షక్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కూరగాయల నారు పంపిణీ**



తొర్రూర్ ఫిబ్రవరి 5 (వాయిస్ టుడే) : గత ఐదు సంవత్సరాలుగా ప్రైమర్క్ కాటన్ ప్రాజెక్ట్ వారి సహకారంతో పత్తి సాగు చేస్తున్న మహిళా రైతులకు మహబూబాద్ జిల్లా ఉద్యానవన శాఖ వారి సౌజన్యంతో హక్దర్షక్ సంస్థ వారి ఆధ్వర్యంలో నెల్లికుదురు మండలంలోని రామన్నగూడెం, రాజుల కొత్తపల్లి, చిన్న ముప్పారం మరియు శ్రీరామగిరి గ్రామాలకు చెందిన సుమారు 20 మంది కూరగాయలు సాగు చేసే రైతులకు ఉచితంగా టమాటా, వంకాయ, పచ్చిమిర్చి నారును అందజేయడం జరిగింది. ప్రధానంగా ప్రైమర్క్ కాటన్ ప్రాజెక్టు సూచన మేరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం కోసం రైతుల అభివృద్ధి కోసం ప్రవేశపెడుతున్నటువంటి పథకాలను క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి లబ్ధి పొందే విధంగా చేయాలని ఉద్దేశంతో 4000 మంది మహిళా రైతులతో ఈ యొక్క కార్యక్రమం చేపట్టడం జరిగింది. దానిలో భాగంగా ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన మరియు ఆధార్ బ్యాంకు సీడింగ్ ఉద్యానవన శాఖ వారి సౌజన్యంతో ఉచిత కూరగాయల నారు పంపిణీ లాంటి కార్యక్రమాలు మండలంలో చేపట్టడం జరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ జిల్లా కోఆర్డినేటర్ వంగాల రవీందర్ మరియు హెచ్ డి చీకటి సంధ్యారాణి, సూరబోయిన ఉష, లబ్ధిదారులు బండి రాధిక, పాశం సుభద్ర, ఆవారి సరిత, గండ్ల మమత, బండి శ్రీనివాస్, లక్కాకుల దేవయ్య, తూటి మాధవి, మహమ్మద్ అమేధ, మరియు గుగులోతు రాజన్న, గుగులోతు హరిలాల్, లక్ష్మి గ్రామస్తులు పాల్గొనడం జరిగింది.



## గ్రామ అభివృద్ధికి బాటలు.. ఉపాధి హామీ పనులకు శ్రీకారం!

కోనరావుపేట ఫిబ్రవరి 05( వాయిస్ టుడే): జై సేవాలాల్ భూక్యా రెడ్డి తండా గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం పనులను నేడు సర్పంచ్ గారు ఘనంగా ప్రారంభించారు. గ్రామంలో ఉపాధి కల్పనతో పాటు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ నరేష్ గారు మాట్లాడుతూ, గ్రామంలోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం, అలాగే గ్రామాభివృద్ధికి అవసరమైన పనులు పూర్తి చేయడం ప్రభుత్వ ఉపాధి హామీ పథకం ద్వారా సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి అర్హుడైన కూలీకి పని దొరికేలా చర్యలు తీసుకుంటామని, పనులు సకాలంలో జరిగేలా పర్యవేక్షణ కొనసాగిస్తామని పేర్కొన్నారు. ప్రారంభ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతి గ్రామ ఉపసర్పంచ్ రాజు నాయక్, వార్డు సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్ లకవత్ రాజు, విష్ణు, ఉపాధి హామీ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బీజేపీకి గెలిపించిన వెంటనే హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలీటీలకు కేంద్రం నుండి రూ.500 కోట్లు తెస్తా..

**మా చొరవతోనే పంచాయతీలకు రూ.250 కోట్లు విడుదలైనయ్**

**రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీలకు ఇచ్చింది గాడిద గుడ్డే**

**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు**





హుజురాబాద్ ఫిబ్రవరి 5 (వాయిస్ టుడే): మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే రాష్ట్రానికి రూ.500 కోట్ల నిధులు తీసుకొస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలైనందున కేంద్రం తాజాగా రూ.259 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, తాను చొరవ తీసుకోవడంవల్లే నిధులు విడుదలయ్యాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీలకు గాడిద గుడ్డు మాత్రమే ఇచ్చిందని ఎద్దేవా చేశారు. తమకు మోసపు మాటలు చెప్పడం చేతకాదని, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మాదిరిగా దొంగ హామీలు ఇవ్వలేమని చెప్పారు. మాట ఇచ్చామంటే తప్పకుండా నెరవేర్చి తీరుతామని అన్నారు. హుజూరాబాద్ మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే ఢిల్లీకి పోయి పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి హుజూరాబాద్ పట్టణం రూపురేఖలు మారుస్తానని హామీ ఇచ్చారు. హుజూరాబాద్ లో మినీ స్టేడియం నిర్మాణం కోసం కేంద్రం నుండి నిధులు తీసుకొచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా ఆటంకాలు కల్పించడంవల్ల ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. ఎన్నికలైన వెంటనే స్టేడియం నిర్మాణం పనులు మొదలుపెట్టేలా చర్యలు తీసుకుంటానని, ఎవరు అడ్డు వస్తారో చూస్తానని అన్నారు.

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈరోజు హుజూరాబాద్ పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, ఎన్నికల ఇంఛార్జ్ ఎర్రం మహేశ్ సహా స్థానిక నేతలంతా సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు..

హుజూరాబాద్ పట్టణానికి పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చిన. కేంద్ర ప్రభుత్వం హుజూరాబాద్ అభివృద్ధి కోసం ఎన్ని నిధులిచ్చిందో, ఏయే అభివృద్ధి పనులు జరిగాయో పూర్తి వివరాలతో సహా బుక్ లెట్ ప్రింట్ చేయించిన. వాటిని ఇంటింటికీ పంపుతున్నా. 14, 15వ ఆర్థిక సంఘం ద్వారా 19 కోట్ల 57 లక్షలు... స్వచ్ఛ భారత్ ద్వారా 1 కోటి 10 లక్షలు.... అమ్రుత్ 16 కోట్ల 25 లక్షలు... స్వనిధి ద్వారా 4వేల 377 మందికి 7 కోట్ల 63 లక్షలు...పట్టణ మౌలిక సదుపాయాల(యూఐడీఎఫ్) ద్వారా 36 కోట్లు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఇచ్చింది. వీధి దీపాల మొదలు, రోడ్లు, డ్రైనేజీ, స్మశాన వాటిక నిర్మాణం దాకా అన్నీ కేంద్ర నిధులే... ఇవిగాక సీఎస్సార్, ఎంపీ లాడ్స్ నిధులతో కోట్ల రూపాయలు తీసుకొచ్చి హుజూరాబాద్ లో ఆసుపత్రికి మెడికల్ ఎక్విప్ మెంట్స్ ఇచ్చిన. వాటిని మెయింటెనెన్స్ చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికే ఉంది. కానీ అక్కడ డాక్టర్లు, సిబ్బంది ఆశించిన స్థాయిలో లేరు. అట్లాగే కమ్యూనిటీ హాల్స్ నిర్మించిన. బోర్లు వేయించిన. ప్రభుత్వ స్కూళ్లలో టెన్త్ చదివే విద్యార్థులందరికీ ఉచితంగా సైకిళ్లు ఇచ్చిన. టెన్త్ పరీక్ష ఫీజు నా జీతం నుండే చెల్లించిన. బీజేపీకి మున్సిపల్ చైర్మన్ పీఠం అప్పగించిన వెంటనే హుజూరాబాద్ పట్టణంలో అర్థాంతరంగా నిలిచిన మినీ ట్యాంక్ బండ్ పనుల పూర్తి చేయిస్తా. పట్టణంలోని నిరుపేదలకు ఇళ్ల మంజు చేయిస్తా. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పంపిణికి తక్షణ చర్యలు చేపడతాం. పట్టణంలో అవసరమైన చోట మురుగు కాలువలు, సీసీ రోడ్లు, విద్యుత్ దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. హుజూరాబాద్ సుందర పట్టణాలుగా తీర్చి దిద్దేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటా. హుజూరాబాద్‌లో కూడా మినీ స్టేడియం ఏర్పాటుకు కేంద్ర మంత్రిగా ప్రత్యేక చొరవ తీసుకొని నిధుల మంజూరికి కృషి చేస్తా. హుజూరాబాద్ నియోజకవర్గానికే పెద్దదిక్కుగా ఉన్న 100 పడకల ప్రభుత్వ దావఖానాలో కార్పోరేట్ స్థాయి వైద్య సేవలు అందేలా ప్రత్యేక చొరవ తీసుకుంటాం. మాకు మోసాలు చేయడం రాదు. దొంగ హామీలివ్వడం చేతకాదు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసపు మాటలు నమ్మి మీరు మోసపోయారు. అందుకే మహిళలకు రూ.2500లు, తులం బంగారం, స్కూటీ, అవ్వాతాతలకు రూ.4 వేలు, నిరుద్యోగ భ్రుతి ఇయ్యలే. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీలకు ఏమిచ్చారు? గాడిద గుడ్డు తప్ప. అందుకే మంచి పాలన కోసం ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వండి ..మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటా అన్నారు.

# రేవంత్ రెడ్డి శ్వేత పత్రం విడుదల చేసే దమ్ముందా?

**కరీంనగర్ కు రూ.1400 కోట్లు విడుదల చేశానని చెప్పడం పెద్ద జోక్**

**రెండేళ్ల పాలనలో కరీంనగర్‌కు నయాపైసా ఇయ్యలే**

**దొంగ మాటలతో కొంపలు ముంచే సీఎం మాటలు నమ్మి మోసపోకండి**

**సీఎంకు రోషం, పౌరుషం చచ్చిపోయిందని ఒప్పుకుంటారా?**

**కేసీఆర్ పంపే మూటలను ఢిల్లీకి పంపి సీఎం సీటును కాపాడుకుంటున్నారా?**

**మున్సిపల్ ఎన్నికలైపోగానే ఇంటి పన్నులు, నల్లా ఛార్జీలు పెంపు తథ్యం**

**ఎన్నికల సభలో బండి సంజయ కుమార్**




కరీంనగర్, ఫిబ్రవరి 05(వాయిస్ టుడే): కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో కరీంనగర్ కు రూ.1400 కోట్లు ఇచ్చానంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పచ్చి అబద్దాలాడుతున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సీఎంకు నిజంగా దమ్ముంటే ఆ నిధులు ఎప్పుడు ఇచ్చారు? ఏయే అభివృద్ధి పనులకు ఖర్చు చేశారు? అనే వివరాలతో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.'నన్ను కోసినా నయాపైసా లేదు'అని పదేపదే చెప్పిన రేవంత్ రెడ్డికి నిధులు ఎక్కడి నుండి వచ్చాయని ప్రశ్నించారు. అవినీతి కేసుల్లో కేసీఆర్,కేటీఆర్ లను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని కేంద్రాన్ని నిందించడం విచిత్రంగా ఉందన్నారు."రేవంత్ రెడ్డి మీలో రోశం, పౌరుషం చచ్చిపోయిందా? కేసీఆర్ పంపే మూటలతోనే ఢిల్లీకి పంపి సీఎం సీటును కాపాడుకుంటున్నారా? అందుకే ఆ కుటుంబాన్ని అరెస్ట్ చేయలేకపోతున్నానని ఒప్పుకుంటే చెప్పండి.కేసీఆర్ కుటుంబం సంగతి మేం చూస్తాం.మా భుజం మీద తుపాకీ పెట్టి ఇతరులను కాలుద్దామంటే ఆ ట్రాప్ లో ఇరుక్కోవడానికి మేం సిద్ధంగా లేం. సీఎంకు రోషం, పౌరుషం చచ్చిపోయిందని ఒప్పుకుంటారా?. కేసీఆర్ పంపే మూటలను ఢిల్లీకి పంపి సీఎం సీటును కాపాడుకుంటున్నారా? అందుకే కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేయలేకపోతున్నానని ఒప్పుకుంటారా? మీకు చేతగాదని ఒప్పుకుంటే కేసీఆర్ కుటుంబం సంగతి మేం చూస్తాం"అని అన్నారు. కరీంనగర్,వరంగల్ పట్టణాలను జంట నగరాలుగా మార్చి డంపింగ్ యార్డ్ ను తరలిస్తానని సీఎం చెప్పడం పెద్ద జోక్ అని ఎద్దేవా చేశారు.డంపింగ్ యార్డు తరలింపు కోసం కేంద్రం నుండి రూ.50 కోట్లు మంజూరు చేయించడంతోపాటు చెత్త బయో మైనింగ్ కోసం మరో రూ.18 కోట్లు విడుదల చేసినా ప్రత్యామ్నాయ స్థలం చూపకుండా కాంగ్రెస్ ప్రభుత్వమే అడ్డుకుంటోందని ఆరోపించారు.మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బొమ్మకల్ అంబేద్కర్ విగ్రహంవద్ద నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్ లో పాల్గొన్నారు.6, 34 డివిజన్ల అభ్యర్థుల పక్షాన ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇయాళ కరీంనగర్ కు వచ్చారు. ఆయన ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేశారా? మహిళలకు రూ.2500లు, తులం బంగారం,స్కూటీ, అవ్వాతాతలకు రూ.4 వేల పెన్షన్, నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలిచ్చారా? కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధికి రూ.1500 కోట్లు తెచ్చిన.ఏయే పనులు చేశానో వివరాలతోసహా బుక్ లెట్ ప్రింట్ చేయించి ఇంటింటికీ పంపుతున్నా.మొన్నటికి మొన్న నీళ్ల కోసం రూ.134 కోట్లు తెచ్చిన. ఇదిగాకుండా కార్పొరేషన్ కు మరో రూ.50 కోట్లు తెచ్చిన. ఇయాళ కరీంనగర్ కు వచ్చిన రేవంత్ రెడ్డి వచ్చి బండి సంజయ్ 7 రూపాయలైనా తెచ్చాడా? అని అడుగుతున్నడు. నేను చేసిన అభివృద్ధి, తెచ్చిన నిధుల వివరాలన్నీ బుక్ లెట్ రూపంలో మీ ఇంటికి పంపుతున్నా.సచివాలయానికి పంపుతున్నా. చదువుకోవాలి. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో నయాపైసా ఇయ్యని రేవంత్ రెడ్డి కరీంనగర్ కు రూ.1400 కోట్లు ఇచ్చినట్లు చెప్పడం విడ్డూరం. అంతేగాకుండా కరీంనగర్ ను వరంగల్ ను జంటనగరాలుగా మారుస్తానని, డంప్ యార్డ్ ను తరలిస్తానని చెప్పడం పెద్ద జోక్. రేవంత్ రెడ్డికి దమ్ముంటే కరీంనగర్ కు రెండేళ్లలో ఎన్ని నిధులు ఇచ్చారు? ఏయే అభివృద్ధి పనులు చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలి.ఇయాళ రేవంత్ రెడ్డి వస్తే, ఎల్లుండి ఆయన అన్న అసదుద్దీన్ ఒవైసీ వస్తున్నడు. ఇద్దరూ మాట్లాడుకునే వస్తున్నరు. నేను అభివృద్ధి పేరుతో ఎన్నికల్లోకి వస్తున్నా.వాళ్లు మతం పేరుతో రెచ్చగొట్టి ఓట్లు దండుకోవాలనుకుంటున్నరు. పొరపాటున మీరు కాంగ్రెస్ కు ఓట్లేస్తే అభివృద్ధి ఆగిపోతుంది.అవినీతి కేసుల్లో కేసీఆర్ కుటుంబాన్ని ఎందుకు అరెస్ట్ చేయడం లేదని రేవంత్ రెడ్డి మమ్ముల్ని అడగడం ఆశ్చర్యంగా ఉంది. మా భుజం మీద తుపాకీ పెట్టి కాలుస్తామంటే ఆ ట్రాప్ లో పడటానికి మేం సిద్ధంగా లేం.అంత అమాయకులం కాదు. కమలం లక్ష్మీ అమ్మవారి పువ్వు.ధన లక్ష్మీ.స్వస్తిక్ అంటే శుభ సూచకం.రేపు పోలింగ్ నాడు బ్యాలెట్ పేపర్ పై స్వస్తిక్ గుర్తు గుద్దితే అమ్మవారికి మీరు పువ్వు సమర్పించినట్లు.మీకు అన్ని శుభాలే కలుగుతాయి. పొరపాటున కాంగ్రెస్ హస్తం గుర్తుపై గుద్దితే అదే చేయి మీ పాలిట భస్మాసుర హస్తమవుతుంది. షెడ్డుకు పోయిన కారుకు ఓటేసి దండుగ అన్నారు.

## కాజీపేటలో ఘనంగా అయ్యప్ప స్వామి ఉత్తర నక్షత్రం



కాజీపేట, వాయిస్ టుడే: గురువారం అయ్యప్ప స్వామి ఉత్తర నక్షత్రం (అయ్యప్ప స్వామి యొక్క పుట్టినరోజు) సందర్భంగా డిజిల్ కాలనీలోని మణికంఠ స్వామికి అయ్యప్ప భక్తులు వారి ఆధ్వర్యంలో బుధవారం పాలు పూలు పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామిని భజన చేస్తూ అలంకరించారు. ఈ సందర్భంగా స్వామివారి యొక్క శరణు ఘోషతో డీజిల్ కాలనీ దేవాలయం మారుమ్రోగింది. ఆ తర్వాత గుడి యందు ఉన్న అందరి దేవతలను దర్శించుకుని తీర్థ ప్రసాదములు తీసుకొని డీజిల్ కాలనీ లోని అయ్యప్ప కుటీరం గౌరవ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి గురు స్వామి ఆధ్వర్యంలో వేద పండితులు రాజేష్ తీర్థ ప్రసాదాలు ఇచ్చి అయ్యప్ప ఆశీర్వాదం అందరికీ ఎల్లవేళలా ఉండాలని..ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. అయ్యప్పను స్వాములు కోరారు. ఈ సందర్భంగా భక్తులు అయ్యప్ప స్వామికి భజన చేశారు. ఈ పూజా కార్యక్రమంలో గురు స్వాములు తంగేళ్లపల్లి శ్రీనివాస్,జరిపోతుల వెంకటేశ్వర్లు,గిరిమిట్ల రాజేష్,హేమంత్,కృష్ణ,దండిగం సతీష్ కుమార్,నడిచెట్టి కుమార్ డిజిటల్ కాలనీ ప్రాంతానికి చెందిన అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

## ఇండ్లు కోల్పోతున్న వారికి ఆదుకునేందుకు సిద్ధం

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**భద్రకాళి మాఢవీధుల కాలనీవాసులు,అధికారులతో కలెక్టర్ సమీక్ష**

హనుమకొండ జిల్లా, వాయిస్ టుడే:: భద్రకాళి మాఢవీధుల నిర్మాణంలో ఇండ్లు కోల్పోతున్న వారికి ప్రభుత్వం నుండి సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో భద్రకాళి మాడవీధుల నిర్మాణంలో ఇండ్లు కోల్పోతున్న కుటుంబాలతో డబ్ల్యూఎంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్,కుడా,రెవెన్యూ,ఇతర శాఖల అధికారులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండ్లు కోల్పోతున్న వారు తమ అభిప్రాయాలను కలెక్టర్ కు తెలియజేశారు. ఇండ్లు కోల్పోతున్న తమకు మరొకచోట ఇండ్లు ఇవ్వాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రస్తుతం భద్రకాళి మాఢవీధుల నిర్మాణపనులు జరుగుతున్నాయని..సహకరిస్తున్నందుకు కాలనీ వాసులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇండ్లు కోల్పోతున్న వారికి ప్రభుత్వం తరపున ప్రయోజనాలను కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సమావేశంలో హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్,కుడా సిపిఓ అజిత్ రెడ్డి,హనుమకొండ తహసిల్దార్ రవీందర్ రెడ్డి,గృహ నిర్మాణ శాఖ పి.డి సిద్ధార్థ నాయక్,మైనింగ్ ఏడి రవిశంకర్,జిడబ్ల్యూఎంసి కాజీపేట డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్,జీడబ్ల్యుఎంసీ సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్,ఇతర అధికారులతో పాటు మాజీ కార్పొరేటర్ బోడ డిన్న,ఇండ్ల నివాసులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బిజెపిలకు ఎందుకు ఓటెయ్యాలి?

**కెసిఆర్ చేసిన పనులే తప్ప.. కాంగ్రెస్ బిజెపి చేసింది ఏమీ లేదు**

**ఆరు గ్యారెంటీలు అడుగుతున్నందునే నాపై కుట్రలు.. కేసులు..**

**హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

**బోర్నపల్లిలోని 12,14,24 వార్డులో ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి**



హుజురాబాద్ ఫిబ్రవరి 5 (వాయిస్ టుడే): గ్రామాల్లో పట్టణాల్లో నాడు ముఖ్యమంత్రిగా కెసిఆర్ చేసిన అభివృద్ధి పనులే తప్ప కాంగ్రెస్ , బిజెపి చేసింది ఏమీ లేదని తట్టెడు మట్టి కూడా తీయలేదని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విమర్శించారు. గురువారం ఆయన స్థానిక మున్సిపల్ పరిధిలోని బోర్నపల్లి లో 12,14,24,వార్డు లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనకు పట్టణ ప్రజలు ఘన స్వాగతం పలికి బ్రహ్మరథం పట్టారు. బిఆర్ఎస్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతినిత్యం తాను కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చి మోసం చేసిన హామీలను ప్రశ్నిస్తున్నారని అందుకే తనపై కేసులు పెట్టారని మండిపడ్డారు. వీణవంకలో జాతరకు వెళితే తనను అడ్డుకున్నారని.. పోలీసులు గొరగొర గుంజుకు వెళ్లారని.. తనను గుంజుకు వెళితే పరవాలేదని కానీ.. తన భార్య బిడ్డను ఎందుకు అడ్డుకున్నారని ఆయన ప్రశ్నించారు. తన ప్రశ్నలకు జవాబులు చెప్పలేక తనను అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ ప్రభుత్వానికి భయపడేది లేదని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ బిజెపి అభ్యర్థులు ఓట్ల కోసం వస్తే వాళ్లని నిలదీయాలని కోరారు. గ్రామాల్లో పట్టణాల్లో ఇళ్ళ ముందు రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, ఇతర మౌలిక సదుపాయాలన్నీ కేసీఆర్ హయాంలోని జరిగాయని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం కెసిఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు అన్ని నిలిపివేసిందని కౌశిక్ విమర్శించారు. కెసిఆర్ రైతుబంధు సమయానికి ఇచ్చారని, 24 గంటల కరెంటు, రైతుబంధు, రైతు బీమా, పింఛన్లు, కల్యాణ లక్ష్మి, కంటి వెలుగు, ప్రాజెక్టులు, తాగునీరు సాగునీరు అన్ని అందించారని గుర్తు చేశారు. నేడు ఒక పథకాన్ని కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేయడం లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలిస్తే అన్ని ఇస్తామంటూ హర్రాజు పాటలా నాడు చెప్పారని.. కానీ ఏ ఒక్కటి కూడా ఇవ్వలేదన్నారు. పింఛన్లు పెంచలేదని, మహిళలకు రూ.2500 ఇస్తామని ఇవ్వలేదని, కంటి వెలుగు లేదని తులం బంగారం లేదని, రైతుల ధాన్యానికి బోనస్ లేదని, విద్యార్థులకు స్కూటీలు ఇవ్వలేదని, ఫీజు రియంబర్స్మెంట్లు చెల్లించలేదని అన్నారు. బాకీ కార్డులను ఆయన ప్రదర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం నాడు అన్ని చెప్పిందని కానీ నేడు ఒక్కటి కూడా అమలు చేయడం లేదని కాంగ్రెస్ అభ్యర్థులను ఈ విషయమై నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు. రైతులకు యూరియా ఇచ్చే పరిస్థితి కూడా లేదని, యూరియా కోసం జుట్లు పట్టుకొని కొట్టుకునే పరిస్థితి కాంగ్రెస్ హయాంలో దాపురించిందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ బిజెపి అభ్యర్థులు డబ్బులు పట్టుకొని వస్తున్నారని వారి వద్ద డబ్బులు తీసుకొని కారు గుర్తుకు ఓటెయ్యాలని ఆయన పిలుపునిచ్చారు. ఇక్కడ తాను ఎమ్మెల్యేగా ఉన్నారని కానీ.. కౌన్సిలర్గా వేరే పార్టీ వారు గెలిస్తే వారు చేసేది ఏమీ ఉండదని.. కారు గుర్తు అభ్యర్థులను గెలిపించి తనకు ప్రభుత్వాన్ని ప్రశ్నించే బలాన్ని ఇవ్వాలని ఆయన అన్నారు. బోర్నపల్లి నుండి ఇప్పల్ నర్సింగాపూర్ తను రోడ్డు ప్రతిపాదన పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని ఆయన ఆరోపించారు. ప్రజలకు ఎప్పుడు ఏ అవసరమొచ్చినా తాను అండగా ఉంటారని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ వెన్ను పోటువేస్తే గోసపడతామని కెసిఆర్ అనడే చెప్పారని అనుకున్నదే జరిగిందని.. కాంగ్రెస్ ప్రభుత్వ బాకీ కార్డులను తాము ఇంటింటికి ఇస్తున్నామని.. కాంగ్రెస్ అభ్యర్థులు ఓట్లకు వస్తే బాకీల గురించి నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు.

## తొర్రూరులో ఎర్రబెల్లి ఇంటింటి ప్రచారం

**కర్నే నాగరాజును గెలిపియండి**

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**



తొర్రూరు ఫిబ్రవరి 5 (వాయిస్ టుడే) : రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల ప్రచారాలు జోరందుకోగా, మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఇంటింటి ప్రచారాన్ని వేగవంతం చేసింది. గురువారం పట్టణంలోని 11, 15, 16వ వార్డుల్లో బిఆర్ఎస్ అభ్యర్థులు కర్నె నాగరాజు, చకిలేల అలివేణి, ధరావత్ జై సింగ్ గెలుపు కోసం రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ, బీఆర్ఎస్ పాలనలోనే తొర్రూరు మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. గ్యాస్ సిలిండర్ సబ్సిడీతో పాటు ఆరు గ్యారంటీల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఎన్నికల సమయంలో పెన్షన్లను రూ.2,000 నుంచి రూ.4,000 చేస్తామని చెప్పి ఇప్పటివరకు అమలు చేయలేదని, ఒక్కో వృద్ధుడిపై సుమారు రూ.60 వేల బాకీలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు స్కూటీలు, రైతులకు రైతుబంధు--బోనస్, వివాహాలకు కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం వంటి హామీలు గాలికొదిలేశారని మండిపడ్డారు. కేసీఆర్ గిరిజనుల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం లంబాడీ బిడ్డల హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. మహిళలకు పంపిణీ చేస్తున్న ఇందిరమ్మ చీరల విషయంలో కమిషన్ల కక్కుర్తితో సుమారు రూ.450 కోట్ల రుణాల్లో భారీ కుంభకోణం జరిగిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతుల పక్షాన నిలిచిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని, రైతుబంధు, రైతు భరోసా వంటి పథకాల ద్వారా రైతులకు అండగా నిలిచారని గుర్తు చేశారు. తొర్రూరు మున్సిపాలిటీలో రూ.100 కోట్లకు పైగా అభివృద్ధి పనులు మంజూరై ఉన్నా, రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా అభివృద్ధి శూన్యంగా మారిందని అన్నారు. సెంట్రల్ లైటింగ్, పాల కేంద్రం వంటి పనులు ప్రారంభం కాకపోవడం కాంగ్రెస్ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. రాబోయే ఎన్నికల్లో ఓటు అడగడానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను వారి దొంగ హామీలపై నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 01వ వార్డు కాంగ్రెస్ పార్టీకి చెందిన యాదగిరి, రవి, వెంకన్న, వీరయ్య, రావుల, పుష్ప, సరిగి, లలిత, యాకమ్మతో పాటు మరో 30 మంది బీఆర్ఎస్ పార్టీలోకి చేరగా, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి బీఆర్ఎస్ నాయకులు, సీనియర్ కార్యకర్తలు, యువ నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలు పాల్గొన్నారు. తొర్రూరు పట్టణంలో ఇంటింటి ప్రచారం ఉత్సాహంగా కొనసాగింది.

## కే.యులో ఈనెల 7వ తారీఖున మెగా జాబ్ మేళా

**పోస్టర్ ఆవిష్కరించిన కేయూ విసి ఆచార్య ప్రతాపరెడ్డి**

హనుమకొండ జిల్లా, వాయిస్ టుడే: కాకతీయ విశ్వవిద్యాలయ ప్లేస్‌మెంట్ సెల్, హైదరాబాద్ మేజిక్ బస్ ఫౌండేషన్ సంయుక్తంగా హైదరాబాద్‌లో "సి.ఐ.ఎస్ టెక్నాలజీ ప్రైవేటు లిమిటెడ్ (CIS Technology Private Limited)µµ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7వ తేదీ శనివారం ఉదయం 10:30 నుండి సాయంత్రం 4:30 వరకు మెగా జాబ్ మేళా కేయూ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్టు విశ్వవిద్యాలయ ప్లేస్‌మెంట్ సెల్ సంచాలకులు డాక్టర్ చిర్రా రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను గురువారం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి,రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం చేతుల మీదుగా ఆవిష్కరించారు. జాబ్ మేళా 2023, 2024, 2025 మరియు 2026 సంవత్సరాలలో పాస్ అవుట్ విద్యార్థులందరికీ అవకాశం ఉంటుందని,ఎంపిక అయిన అభ్యర్థులు హైదరాబాద్ కేంద్రంలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. మొత్తం 400 మంది అభ్యర్థులను ఎంపిక చేసుకునే విధంగా ఈ మెగా జాబ్ మేళా నిర్వహించ బడుతుందని.. ఎంపికైన వారికి వెంటనే నియామక పత్రం ఇవ్వబడనుందని డాక్టర్ చిర్ర రాజు తెలిపారు. 2023,2024,2025,2026 సంవత్సరాల పాస్ అవుట్ విద్యార్థులు ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. ఈ పోస్టర్ విడుదల కార్యక్రమంలో ఆచార్య బి.సురేష్ లాల్,ఆచార్య రాజేంద్ర కట్ల,ఆచార్య ఎస్.నరసింహ చారి,ఆచార్య మామిడల ఇస్తారి,ఆచార్య వై.వెంకయ్య,ఇంజనీరింగ్ కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు డాక్టర్ సంతోష్,బొల్లం కిరణ్,మేజిక్ బస్ ఫౌండేషన్ బాధ్యులు రాకేష్ ల్యాదేల్ల,నందీశ్వర్ పాల్గొన్నారు.

## ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఎమ్మెల్యే నాగరాజు

**వృద్ధ దంపతులకు స్వయంగా ఇల్లు కట్టించిన ఎమ్మెల్యే**

**ఆస్టోరినిక్' సంస్థతో 5 లక్షల రూపాయలతో ఇళ్ల నిర్మాణం**

**ఎమ్మెల్యే పనితీరుపై పలువురి అభినందన.. కృతజ్ఞతలు**



హనుమకొండ జిల్లా, వాయిస్ టుడే: ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు బిర్రు నర్సమ్మ ఉపలయ్య వృద్ధ దంపతులకు ఇల్లు కట్టుకునే స్థితిలో లేకపోవడంతో ప్రజాసేవలో నిజమైన నాయకత్వం చూపిస్తున్న వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు 'ఆస్టోరినిక్' సంస్థతో 5 లక్షల రూపాయల మేర ఇళ్ల నిర్మాణం పూర్తి చేయించేలా చర్యలు చేపట్టారు. ఇది కేవలం ఓ ప్రాజెక్ట్ కాదు.. నాయకత్వం, బాధ్యత, ప్రజాప్రయోజనం అన్నమాటకు చారిత్రాత్మక ఉదాహరణ అని స్థానికులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ప్రథమ ఇల్లు నిర్మాణం ప్రారంభమైంది. వర్ధన్నపేట టౌన్‌లో తొలి ఇల్లు పనులను ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు స్వయంగా పరిశీలించి నిర్మాణం నాణ్యతపై సకాలంలో దృష్టి సారించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల సంక్షోభాలను తెలుసుకుని వాటికి తక్షణమే పరిష్కారం చూపించగల నాయకత్వం అన్నదే స్పష్టం అవుతుంది. ప్రజా ఆశలు,మాటలు కాదు పనితోనే నిరూపిస్తున్న నాయకత్వం ఇది అని పలువురు అంటున్నారు. ఇలాంటి సానుకూల చర్యలు వర్ధన్నపేటలోనే కాకుండా నియోజకవర్గ స్థాయిలో కూడా మార్గదర్శకంగా నిలుస్తాయని స్థానికులు అభినందిస్తున్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో 10వ వార్డు అభ్యర్థి కొండేటి రజిత సాంబయ్య తో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలి

**13వ వార్డు నర్సాపూర్ మున్సిపల్ బిజెపి పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి భూచ్చేష్ యాదవ్**

నర్సాపూర్ (వాయిస్ టుడే) : 11వ తేదీ జరిగే మున్సిపల్ ఎన్నికల్లో 13వ వార్డు అక్క చెల్లెలు అన్నదమ్ములు ప్రజలు తనను ఆశీర్వదించాలని 13వ వార్డు అభివృద్ధికి అన్ని విధాలుగా సేవ చేస్తానని నర్సాపూర్ మున్సిపల్ బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి బుచ్చిష్ యాదవ్ అన్నారు గురువారం నాడు 13వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ మున్సిపల్ బిజెపి పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి బుచ్చేష్ యాదవ్ మాట్లాడుతూ 11 వ తేదీ జరిగే మున్సిపల్ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని 13వ వార్డు ప్రజలకు అక్కాచెల్లెళ్లు అన్నదమ్ములు ను కోరారు గతంలో ఉన్న కౌన్సిలర్ అనుభవంతో వార్డును మరింత అభివృద్ధి చేస్తానని ఆయన తెలిపారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఎమ్మెల్సీ అంజిరెడ్డి సహకారంతో 13వ వార్డు ప్రజలకు అందుబాటులో ఉంటూ అన్ని విధాలుగా అభివృద్ధికి తోడ్పడతానని ఆయన అన్నారు 13వ వార్డు ప్రజలకు నిరంతరం సేవలందిస్తానని కౌన్సిలర్ అభ్యర్థి బుచేస్ యాదవ్ తెలిపారు.

## హార్వర్డ్‌లో చదివిన తీరు మారని సీఎం

### మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు



మిర్యాలగూడ ఫిబ్రవరి 5 (వాయిస్ టుడే ): హార్వర్డ్ యునివర్సిటిలో చదివిన సీఎం రేవంత్ రెడ్డి లో మార్పు రాలేదని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు విమర్శించారు. పట్టణం లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో మాజీ ఎం.పి బడుగుల లింగయ్య యాదవ్ తో కలిసి మాట్లాడారు. ముఖ్యమంత్రి హెూదా లో ఉండి బజార్ రౌడిలా మాట్లాడటం సీఎం విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. భాధ్యత గ పదవిలో ఉండి భాధ్యతరహితంగా మాట్లాడి తానే దిగజారేడు తప్ప తనకేమి నష్టం జరగలేదని అన్నారు. నక్కజీత్తుల పని చేసి జైలు వెళ్లిన నువ్వు నాపై నిందలు వేయడం సరికాదన్నారు. తనపై దూషణలు చేస్తే నీ జాతకం బయటపెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రత్యేక రాష్ట్రం కెసీఆర్ తో సాధ్యమైనందున సీఎం పదవి నీకు వచ్చిందన్న విషయం మరిచిపోవద్దని అన్నారు. రాష్ట్రం లో కెసీఆర్ జాతిపీత అని అన్నారు. ఈ సమావేశం నాయకులు కట్టా మల్లేష్ గౌడ్ , చిర్ర మల్లయ్య యాదవ్ ,నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి ,నకిరేకంటి రాబర్ట్ రాయరపు వెంకన్న అమరారపు తిరుమలేష్ అలుగుబెల్లి గోవింద్ రెడ్డి పుట్టల సందీఫ్ తదితరులు పాల్గొన్నారు.



## 13వ వార్డును అభివృద్ధి చేస్తా...

**13వ వార్డు అక్క చెల్లెలు అన్నదమ్ములు నన్ను ఆశీర్వదించండి**

**అందుబాటులో ఉండి అన్ని విధాలుగా కృషి చేస్తా.**

**జోగిపేట మున్సిపల్ బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి పట్లూరి శేఖర్**

సంగారెడ్డి జిల్లా (వాయిస్ టుడే) : ఇంటింటి ప్రచారంలో 13 వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పట్లూరిశేఖర్ 13 వార్డు ప్రజల అభివృద్ధి. సంక్షేమం కోసం అన్ని విధాల కృషి చేస్తానని గురువారం నాడు ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు కానీ హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని వారి మాటలు నమ్మి మోసపోవద్దు అన్నారు వార్డ్ అభివృద్ధి కోసం అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని. ప్రజలు అపోహలకు గురి కాకుండా 11 తారీఖు జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లోకారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని 13వ వార్డు ప్రజలకు సూచించారు ఈ కార్యక్రమంలోమాజీ ఎంపిటిసి ఆకుల శంకర్ బి ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు 13వ ప్రజలు పాల్గొన్నారు.

## బోరుపట్ల గీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యురాలు ప్రమీల ఆసుపత్రి పాలు

**సొసైటీ ఉపాధ్యక్షులు అంజా గౌడ్ ఆరోపణ**



నర్సాపూర్ (వాయిస్ టుడే): నియోజకవర్గంలోని బోరపట్ల గ్రామంలో గీత కార్మిక సహకారసంఘం సొసైటీ ఉపాధ్యక్షులు అంజా గౌడ్ గ్రామస్తులు ఒప్పందం ప్రకారం కల్లు దుకాణం కొనసాగుతుండగా శనివారం నాడు బోరపట్ల "ూ సొసైటీ సభ్యులు ఎక్సైజ్ వారికి తప్పుడు ప్రచారం చేసినందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు కల్లు దుకాణాన్ని ధ్వంసం చేశారు. గీత పారిశ్రామిక సహకార సంగం ఉపాధ్యక్షులు అంజా గౌడ్ మాట్లాడుతూ ఈ కళ్ళు దుకాణం ధ్వంసం వల్ల గీతా పారిశ్రామిక సహకార సంఘం సభ్యురాలు ప్రమీల స్టోక్ వచ్చి హాస్పటల్లో అడ్మిట్ చేయడం జరిగింది. అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ఎక్సైజ్ శాఖ అధికారులుకక్ష సాధింపు చర్య కింద తీవ్ర ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గీతా పారిశ్రామిక సహకార సంఘం సభ్యురాలు ప్రమీల మనస్థాపానికి చెంది స్తోకు రావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు సొసైటీ సభ్యురాలు ప్రమీలకు ఎలాంటి ఇబ్బంది అయినా ఎక్సైజ్ శాఖ అధికారులుమరియు సొసైటీ వారిదే బాధ్యత అని అంజా గౌడ్ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తమ బోరపట్ల గ్రామానికి వచ్చి గ్రామ పెద్దల సమక్షంలో తమకు న్యాయం చేయాలని అంజాగౌడ్ కోరారు.

# అభివృద్ధి కోసం హస్తం పార్టీని ఆశీర్వదించండి

**- ఇంటింటి ప్రచారంతో హోరెత్తించిన టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి**

**- సంగారెడ్డిలో ప్రత్యేక ఆకర్షణగా జయాచైతన్యరెడ్డి గడపగడపకూ ప్రచారం**





సంగారెడ్డి జిల్లా (వాయిస్ టుడే ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ తన ప్రచార వేగాన్ని పెంచింది. జగ్గారెడ్డి కూతురు జయాచైతన్య రెడ్డి, సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి పట్టణంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఆప్యాయంగా పలకరిస్తూ.. జయాచైతన్య రెడ్డి సంగారెడ్డిలోని 21, 19, 29, 8, 27వ వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఇల్లుల్లు తిరుగుతూ, అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ జయాచైతన్య రెడ్డి అందరినీ ఆకర్షించారు. ప్రచారం సందర్భంగా జయారెడ్డికి ప్రజలు తమ సమస్యలను వివరించారు. మీకు జగ్గారెడ్డి ఉన్నారు, ధైర్యంగా ఉండండి అంటూ ప్రజలకు భరోసా కల్పించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, సంగారెడ్డి పట్టణం అభివృద్ధిలో ముందుకు సాగాలి అంటే కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**ప్రత్యేక నిధులు తీసుకొచ్చే బాధ్యత నాది**

డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి సంగారెడ్డిలోని 24, 25, 26, 5, 38వ వార్డుల్లో ఇంటిటి ప్రచారం నిర్వహించారు. 38 వార్డుల్లో అన్ని చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని, జగ్గారెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి పట్టణానికి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి సంగారెడ్డి పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి కాంగ్రెస్ పార్టీకి ఓటేసి అభ్యర్థులను భారీ మెజారిటీ తో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్, వీణ హరీష్ గుప్తా, ఆయా వార్డుల కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 15వ వార్డు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా..

**ఇచ్చిన హామీలను తప్పక అమలు చేస్తా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో అభివృద్ధి పనులు చేస్తా**

**15వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి ఆకుల చిట్టిబాబు**



సంగారెడ్డి (వాయిస్ టుడే ప్రతినిధి): జోగిపేట మున్సిపల్ పట్టణంలోని 15వ వార్డు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, వార్డు ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పక అమలు చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని 15వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు) అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం నాడుఇంటింటికి ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్ల పాటు ప్రజలకు సేవకునిగా పని చేసేందుకు 15వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, వార్డు ప్రజలు ఆదరించి ఆశీర్వదించాలని ఆయన కోరారు. 15వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. నిరుపేద కుటుంబాలకు ఆర్థికంగా వారికి అండగా ఉంటానన్నారు. వార్డు పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక చేస్తున్నానని, డ్రైనేజీ వ్యవస్థ, సీసీ కెమెరాలు, పచ్చదనం పరిశుభ్రత, సీసీ రోడ్లు వంటి పనులు చేపడతానన్నారు. వార్డు అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని, జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో అభివృద్ధికి సరిపడే నిధులు తెచ్చి అభివృద్ధి పనులు చేపడతానన్నారు. కౌన్సిలర్ గా గెలిచిన నెల రోజుల్లోనే చెప్పటాల్సిన పనులకు మంత్రితో శంకుస్థాపన చేయిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు 15వ వార్డు ప్రజలు పాల్గొన్నారు.



## సీఎం రేవంత్ రెడ్డి వాక్యాలపై వెలమ సంఘం ఆగ్రహం

రాయికల్ (వాయిస్ టుడే): రాయికల్ పట్టణంలోని స్థానిక ప్రెస్ క్లబ్ లో రాయికల్ మండల వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పాత్రికేయ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గా రాష్ట్రంలోని కుల, మాత,వర్గ భేదం లెకుండా రాష్ట్ర పౌరులందరిని సమానంగా చూస్తాను అని రాజ్యాంగబద్ధంగా చేసిన ప్రమాణాన్ని మరిచిపోయి వెలమ కులం పై విరుచుక పడుతూ మా సామజిక వర్గంపై కక్ష్యా సాధిస్తున్నారు అని కొందరు మా కుల వ్యక్తులతో ఉన్న రాజకీయ వైరుధ్యాలను దృష్టిలో పెట్టుకుని మొత్తం కులాన్ని దుషించడం తగదని వ్యక్తులతో రాజకీయ పంచాది ఉంటే అట్టి వారి తోనె చూసుకోవాలి అని హితువు పలికారు, పదే పదే వెలమ కులం పై తప్పుడు వాక్యాలు చేయడం వలన మా మనోభావాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు,ఇది ఇలాగే పునవృతం అయితే చూస్తు ఊరుకోం అని తగు చర్యలు తీసుకుంటమని కాంగ్రెస్ పార్టీలో ఉన్న వెలమ కులస్తులు రేవంత్ రెడ్డి ని గట్టిగా నిలదీయాలి అని,ఆయనకు మంచి బుద్ధిని నేర్పాలని హితువు పలికారు. ఇకనైనా ముఖ్యమంత్రి తీరు మార్చుకోకుంటే వచ్చే ఎన్నికల్లో మాసత్తా ఎందో చూపిస్తామని హెచ్చరించారు, కేసీఆర్ వెలమ జాతిలో పుట్టి తెలంగాణ రాష్ట్రం తీసుకవచ్చారని అయన అభిమానులు కేసీఆర్ ను జాతి పితా అని గౌరవంగా సంబోధిస్తే మీకు వచ్చిన భాధ ఎంది అని ప్రశ్నించారు,పదేపదే కించపరుస్తు ఉంటే న్యాయబద్ధంగా మీ పై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో దుగ్యాల రాజేశ్వర్ రావు, యాచమనేని శ్రీనివాసరావు, సంతోష్ రావు, జకిలేటి హరీష్ రావు, జకిలేటి రాజశేఖర్ రావు, ప్రశాంత్ రావు, యాచమనేని కిరణ్ రావు, లక్మణ్ రావు, దాసరపు వేణు రావు, కరుణాకర్ రావు, దుగ్యాల రమాపతి రావు, దుగ్యాల శ్రీనివాస్ రావు, సాగర్ రావు,రత్నాకర్ రావు మండల వెలమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఉపసర్పంచ్‌ల ఫోరమ్ ఎన్నిక



రాయికల్ (వాయిస్ టుడే) : రాయికల్ మండల ఉపసర్పంచ్‌ల ఫోరమ్ కార్యవర్గాన్ని ఏకగ్రీవం అయింది .అధ్యక్షులుగా, మూగల సంజీవ చారి,ఉపాధ్యక్షులుగా, భూక్య శంకర్ నాయక్ ,అల్లెపు గంగాధర్ ప్రధాన కార్యదర్శిగా, ఎండీ చంద్ పాషా,కోశాధికారిగా మధుపాక నారాయణ , సలహాదారులుగా మాలోతు సూర్య, కాయితీ సంజీవ్, అర్మురి లక్ష్మీనారాయణ, గుగ్లవత్ శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా బోడ రాజకుమార్, బానవత్ రవి, కొంపెల్లి ప్రియాంక, అల్లెపు నర్సయ్య, కుర్ర మల్లయ్యలను ఎన్నికయ్యారు.



## హజ్రత్ పీర్ గైబ్ సాహెబ్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

ఝరాసంగం ఫిబ్రవరి 05 (వాయిస్ టుడే) : ఝరాసంగం గ్రామం నుండి న్యాల్కల్ మండలంలో ఉన్న హజ్రత్ పీర్ గైబ్ సాహెబ్ దర్గాను నూతనంగా ఎన్నికైన వార్డ్ మెంబర్. ఎం.డి. ఇస్మాయిల్ ప్రత్యేకంగా దర్శించుకున్నారు. వారి వెంట కాంగ్రెస్ యువ నాయకులు సి.హెచ్. దత్తు, ఎం.డి. అమీర్, ఎం.డి. షారొపుద్దీన్, ఎం.డి. మొహమ్మద్ పాల్గొన్నారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

## శివరాత్రి ఉత్సవాల నిర్వహణకు సమన్వయ సమావేశం

రాయికల్ ( వాయిస్ టుడే ) : రాయికల్ మండలంలోని కొత్తపేట శ్రీ రాజరాజేశ్వర నాగాలయం లో నిర్వహించే శివరాత్రి జాతర ఉత్సవాల ఏర్పాట్లపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మండల అధికారులతో గుడి పరిసరాలలో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసారు మహా శివరాత్రి జాతర నిర్వహణపై చెయబోవు ఏర్పాట్ల గూర్చి ప్రణికాలు చేశారు భక్తులకు ఇబ్బందులు కాకుండ రవాణ,వైద్య ,నీరు తదితర ఏర్పాట్లు చెయ్యాలని నిర్ణయించడం జరిగింది ఇట్టి సందర్భంగా తహసీల్దార్ నాగార్జున మాట్లాడుతూ శివారాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. జాతరలో బంధోబస్తు రక్షణ గూర్చి ఎస్సై సుధీర్ రావు తెలిపారు ఈ కార్యాక్రమంలో మండల పరిషత్ ,దేవాదాయ ధర్మాదాయ ,తదితర శాఖల సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గోన్నారు.



## వ్యక్తిగత వికాసంపై అవగాహన

రాయికల్ (వాయిస్ టుడే) : రాయికల్ మండలంలోని భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు ప్రముఖ సైకాలజిస్ట్, గంపా నాగేశ్వర్ రావు చే బెస్ట్ ట్రైనర్ అవార్డ్ గ్రహీత సుధీర్ చే పదవ తరగతి విద్యార్థులకు వ్యక్తిగత వికాసం అవగాహన కల్పించారు కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు బోల్లె చిన్నయ్య, వేణు, శంకరయ్య, సురేష్, సంజయ్, రాజగోపాల్, వంశీ, హుస్సేన్, కమరుద్దీన్, భవాని, శైలజ, పుష్పలత, పాఠశాల మాజీ చైర్మన్ జక్కుల రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## నక్క మంజుల నాగరాజుగౌడ్ కి మద్దతుగా సంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ నాయకులు వీరేశం గౌడ్ ప్రచారం

సంగారెడ్డి జిల్లా (వాయిస్ టుడే ప్రతినిధి ): కారు గుర్తుకు ఓటు వేసి 27వ వార్డు నక్క మంజుల నాగరాజు గౌడ్ గారిని గెలిపించాలి వారికి మద్దతుగా గురువారం నాడు సంగారెడ్డి 27 వార్డు మున్సిపల్ లో ప్రచారంలో పాల్గొని ఈ సందర్భంగా జిల్లా నాయకులు వీరేశం గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీరాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆయన అన్నారు రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పథకాలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు కాబట్టి కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో 27 వార్డు మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థి నక్క మంజుల నాగరాజు గౌడ్ ను గెలిపించాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వీరేశం గౌడ్ కొండల్ రెడ్డి బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు

ఝరాసంగం ఫిబ్రవరి 05 (వాయిస్ టుడే): శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి దేవస్థానంలో 05-02-2026 తేదీన హుండీ లెక్కింపు నిర్వహించారు. మొత్తం 75 రోజుల హుండీ ఆదాయం రూ. 24,75,585 వచ్చిందని దేవస్థానం అధికారులు తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించిన వారు: పర్యవేక్షకులు రంగారావు, దేవస్థానం చైర్మన్ చంద్రశేఖర్, ఈఓ శివ రుద్రప్ప. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు మల్లికార్జున్ పాటిల్ మల్‌శెట్టి, నవాజ్ రెడ్డి, లక్ష్మీ నర్సింహులు, బసయ్య స్వామి పాల్గొన్నారు.

Printed by Published by : Kotha Laxman on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, Editor: Kotha Laxman.